ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి
PRGI REGD No.: TGTEL/26/A4986
పక్కా తెలుగు
5 DOTS NETWORK
మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 008 | గురువారం | 02-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com
Medchal Malkajigiri | Volume : 01 | Issue : 008 | Thursday | 02-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri




## ఆత్మాభిమానానికి ఆరాటం..
# రాజన్న ధర్మ పోరాటం

### యాదాద్రి టెంపుల్ బోర్డ్ నియామకంపై కోమటిరెడ్డి అసంతృప్తి

యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వైటీడీఏ) నియామకాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఎంపీగా, ఎమ్మెల్సీగా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఎంతో సీనియారిటీ ఉన్న తనను ఈ విషయంలో కనీసం సంప్రదించకపోవడం చాలా బాధ కలిగించిందని ఆయన ఆవేదన చెందారు. జిల్లాకు చెందిన కీలక నాయకుడినైన తనకు సమాచారం కూడా ఇవ్వకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరైన పద్ధతి కాదని ఆయన స్పష్టం చేశారు. స్థానిక నాయకులను కాదని హైదరాబాద్‌లో కూర్చొని వన్ సైడ్ నిర్ణయాలు తీసుకోవడం తప్పు అని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. యాదాద్రి జిల్లాకు సంబంధించి ఎవరైనా అనుభవజ్ఞులైన వ్యక్తులను కమిటీ మెంబర్లుగా పెడితే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. అలా కాకుండా మునుగోడు నియోజకవర్గం నుంచి ఎవరికో మెంబర్ పదవి ఇచ్చారని, ఆ సమాచారం కూడా తనకు లేదని చెప్పారు. ప్రస్తుత నాయకత్వ వ్యవహారశైలి తనకు అస్సలు నచ్చడం లేదని ఆయన బహిరంగంగానే తప్పుబట్టారు.

# రామాలయ విరాళాల లూటీ..
## యూపీ ఎన్నికల్లో రాజకీయ సునామీ!




» చంపత్ రాయ్ మజా చేస్తున్నారు
» ముస్లిం ఉంటే ఎన్‌కౌంటర్ చేసేవారు
» విరాళాల చోరీపై ఒవైసీ సంచలన వ్యాఖ్యలు
» ఎన్నికలపై చోరీ ప్రభావం
» యూపీలో రాజుకున్న రాజకీయం
» ప్రతిపక్షాల చేతికి చిక్కిన బ్రహ్మాస్త్రం
» ఉద్యోగాల పేరిట భారీ వసూళ్లు
» దర్యాప్తులో తేలిన మాజీ ట్రస్టీ లీలలు
» రామాలయం ఉద్యోగాల్లో కమిషన్ల దందా
» విచారణలో దొరికిన మాజీ ట్రస్టీ

### బావమరదుల ఘరానా రామాలయ లూటీ
- కుంభమేళా సమయంలోనే కుట్ర మొదలు

అయోధ్య రామాలయ విరాళాల చోరీ కేసు దర్యాప్తులో పోలీసులు సంచలన విషయాలను గుర్తించారు. గత ఏడాది జరిగిన కుంభమేళా సమయంలోనే ఆలయంలో అత్యధికంగా దొంగతనం జరిగినట్లు అయోధ్య పోలీసులు వెల్లడించారు. ఆ సమయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో విరాళాలు, కానుకలు భారీగా వచ్చాయి. నిందితులు ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని పెద్ద ఎత్తున నగదును లూటీ చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది నిందితులను ప్రత్యేక దర్యాప్తు బృందం.. సిట్ అరెస్టు చేసింది.

దేవుడి హుండీ నుంచి మాయమైన విరాళాలు ఇప్పుడు ఉత్తరప్రదేశ్ రాజకీయాలను కుదిపేస్తున్నాయి. అయోధ్య రామాలయ విరాళాల చోరీ కేసు సాధారణ క్రిమినల్ కేసు స్థాయిని దాటి ఎన్నికల అస్త్రంగా మారింది. కుంభమేళా సమయంలోనే కోట్లాది రూపాయల విరాళాలు పక్కదారి పట్టాయని దర్యాప్తులో వెలుగుచూసిన అంశాలు సంచలనం రేపుతున్నాయి. బావమరదుల స్కెచ్, ఎస్బీఐ సిబ్బంది సహకారం, ట్రస్ట్ మాజీ కార్యదర్శి డ్రైవర్ వద్ద తాళంచెవి ఉండటం, దుప్పట్ల మధ్య దాచిన నగదు, ఆస్తుల కొనుగోళ్లు వంటి అంశాలు భక్తుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిలిస్తున్నాయి. ఇదే సమయంలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీ కలిసి ఈ వివాదాన్ని బీజేపీపై బ్రహ్మాస్త్రంగా మలుస్తుండగా, సీఎం యోగి ఆదిత్యనాథ్ హిందూత్వ అజెండాతో ప్రతిదాడికి దిగారు. ఇదే సమయంలో ఉద్యోగాల నియామకాల పేరుతో భారీ కమిషన్ల దందా జరిగినట్లు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రా సిఫార్సులతో వందలాది నియామకాలు జరిగాయని, వాటి కోసం భారీ వసూళ్లు జరిగినట్లు సిట్ గుర్తించింది. విరాళాల చోరీ కేసు విచారణ ఇప్పుడు ఉద్యోగాల అక్రమాలపై కూడా కేంద్రీకృతమైంది. మరోవైపు అసదుద్దీన్ ఒవైసీ చేసిన ఎన్‌కౌంటర్, బుల్డోజర్ వ్యాఖ్యలు రాజకీయ వేడిని మరింత పెంచాయి. కోట్లాది మంది భక్తుల విశ్వాసం, ఆలయ నిధుల భద్రత, ట్రస్ట్ పారదర్శకత, అధికార పార్టీ విశ్వసనీయత అన్నీ ఒకేసారి పరీక్షకు నిలిచిన ఈ వ్యవహారం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల తీర్పును ఎంతవరకు ప్రభావితం చేస్తుందన్నది ఇప్పుడు దేశ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.




## కల్వకుంట్ల కవిత కొత్త పార్టీకి బ్రేక్..!?

**టీఆర్ఎస్ పేరుపై ఈసీకి ఫిర్యాదులు**
**సీన్‌లోకి కేంద్ర ఎన్నికల సంఘం**
**టీఆర్ఎస్ పేరుపై అభ్యంతరాల వెల్లువ**

కల్వకుంట్ల కవిత కొత్తగా స్థాపించిన రాజకీయ పార్టీ రిజిస్ట్రేషన్‌కు గట్టి బ్రేక్ పడింది. ఆమె తన నూతన పార్టీకి "తెలంగాణ రక్షణ సమితి" అని పేరు పెట్టి.. దానికి సంక్షిప్తంగా "టీఆర్ఎస్" అనే అక్షరాలను ఎంచుకున్నారు. అయితే ఈ పేరుపై భారత ఎన్నికల సంఘానికి రికార్డు స్థాయిలో అభ్యంతరాలు వచ్చాయి. దాదాపు 600 నుండి 700 వరకు ఫిర్యాదులు రావడంతో ఈసీ ప్రస్తుతం ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను హోల్డ్‌లో పెట్టింది. దీంతో కవిత స్వతంత్ర రాజకీయ ప్రస్థానానికి ఆరంభంలోనే ఒక పెద్ద చట్టపరమైన చిక్కు వచ్చి పడింది.



# మనీ ఛేజింగ్ సెల్

- ఆదాయం పెంపుపై సర్కార్ నజర్
- వృథా ఖర్చులకు అడ్డుకట్ట వేయండి
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ప్రభుత్వ ఆదాయ సమీకరణపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర బడ్జెట్ లక్ష్యాలకు అనుగుణంగా రాబడిని పెంచాలని, ఎక్కడా రూపాయి కూడా వృథా కాకుండా ఆదాయ లీకేజీలను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, గనుల శాఖ వంటి కీలక విభాగాలలో నిరంతర నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. ఆదాయ సమీకరణ ప్రయత్నాలను నిరంతరం పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక "ఛేజింగ్ సెల్" ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. (వివరాలు 2లో..)



## నేడు కేబినెట్ అత్యవసర భేటీ
- మూసీ, మెట్రోలపై ప్రధాన చర్చ
- కీలక నిర్ణయాలు తీసుకునే ఛాన్స్

# దండుపాళ్యం ముఠాలా దోచుకుంటున్నారు

- ఇజ్జత్ పోయేదానికి ఢిల్లీకి ఎందుకు వెళ్లాలి
- తెలంగాణను పదేపదే కించ పరుస్తున్నారు
- ప్రపంచమంతా కాళేశ్వరాన్ని అభినందించింది
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం
- తేదీ, సమయం చెబితే రావడానికి రెడీ
- రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్



కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు ఇచ్చిన అధికార కాలంలో ఇప్పటికే యాభై శాతం గడువు ముగిసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ కాలంలో తాము ఏం చేశామో చెప్పుకోవడానికి కాంగ్రెస్ వద్ద ఎలాంటి సమాధానం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. (వివరాలు 2లో..)

## రైతుల పేరిట రేవంత్ సర్కార్ కొత్త డ్రామాలు

**వైఫల్యాల నుండి దృష్టి మరల్చే ఎత్తుగడలు**

**కాంగ్రెస్ వైఫల్యాలపై హరీశ్ రావు నిప్పులు**







## శాంతి మంత్రం
- భారత్, పాక్ ప్రధానులకు బహిరంగ లేఖ
- సరిహద్దుల్లో శాంతి కోసం సంయుక్త పిలుపు
- రంగంలోకి 100 మందికి పైగా ప్రముఖులు




## మెటాకు మూడే రోజులు గడువు
వాట్సాప్ కొత్త ఫీచర్‌పై కేంద్రం ఉక్కుపాదం
యూజర్ నేమ్స్ నిలిపేయాలని నోటీసులు




## బీదర్ చెత్త రగడ
- సరిహద్దుల్లో వేస్ట్ ఫైటింగ్
- కర్ణాటక మున్సిపాలిటీ దౌర్జన్యం
- అంతర్రాష్ట్ర రహదారిపై చెత్త కుమ్మరింపు

# చరిత్ర సృష్టించిన ఉస్మానియా వైద్యులు




**ఒకే రోగికి 5 అవయవాల మార్పిడి శస్త్రచికిత్స**
**దేశ వైద్య చరిత్రలో సరికొత్త అధ్యాయం**
**36 గంటల సుదీర్ఘ శస్త్రచికిత్సతో సత్తా**

హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఉస్మానియా జనరల్ ఆసుపత్రి వైద్యులు వైద్య రంగంలోనే ఒక సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రాణాంతకమైన అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఒకే రోగికి ఏకకాలంలో ఐదు అవయవాలను విజయవంతంగా అమర్చారు. జీర్ణాశయం, చిన్న ప్రేగు, ప్యాంక్రియాస్, డుయోడెనమ్, కుడి పెద్ద ప్రేగులను ఒకే శస్త్రచికిత్స ద్వారా మార్పిడి చేశారు. భారతదేశంలోనే ఇలాంటి మల్టీవిసెరల్ ట్రాన్స్‌ప్లాంట్ జరగడం ఇదే మొదటిసారి అని వైద్య వర్గాలు వెల్లడించాయి. ఈ చారిత్రాత్మక శస్త్రచికిత్స ఏకధాటిగా 36 గంటల పాటు సాగడం విశేషం. (వివరాలు 6లో..)




## మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బరితెగింపు
- ఔటర్ రింగ్ రోడ్డుపై కాల్పుల మోత
- పోలీసులపై కత్తితో తెగబడ్డ దొంగ
- శ్రీకాంత్ పై పోలీసుల కాల్పులు

హైదరాబాద్ నగర శివార్లలోని ఔటర్ రింగ్ రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ కలకలం సృష్టించింది. తెలుగు రాష్ట్రాల్లో వందలాది నేరాలకు పాల్పడిన మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ హైదరాబాద్‌లో సంచరిస్తున్నట్లు నల్లగొండ సీసీఎస్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన ప్రత్యేక పోలీస్ బృందం ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంగులూరు ఎగ్జిట్ 12 వద్ద నిందితుడిని చుట్టుముట్టింది. పోలీసుల నుండి తప్పించుకోవడానికి శ్రీకాంత్ తన వద్ద ఉన్న కత్తితో ఒక్కసారిగా వారిపై దాడికి తెగబడ్డాడు. ఈ ఘోర దాడిలో నల్లగొండ సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధనగిరి తలకు తీవ్ర గాయమైంది. (వివరాలు 2లో..)

ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి
General News
గురువారం 02 జులై 2026
www.prabhathakiranam.com

# మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బరితెగింపు

- ఔటర్ రింగ్ రోడ్డుపై కాల్పుల మోత
- పోలీసులపై కత్తితో తెగబడ్డ దొంగ
- శ్రీకాంత్ పై పోలీసుల కాల్పులు

హైదరాబాద్ నగర శివార్లలోని ఔటర్ రింగ్ రోడ్డుపై బుధవారం తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ కలకలం సృష్టించింది. తెలుగు రాష్ట్రాల్లో వందలాది నేరాలకు పాల్పడిన మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ భూష్మి శ్రీకాంత్ హైదరాబాద్‌లో సంచరిస్తున్నట్లు నల్లగొండ సీసీఎస్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన ప్రత్యేక పోలీస్ బృందం ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంగులూరు ఎగ్జిట్ 12 వద్ద నిందితుడిని చుట్టుముట్టింది. పోలీసుల నుండి తప్పించుకోవడానికి శ్రీకాంత్ తన వద్ద ఉన్న కత్తితో ఒక్కసారిగా వారిపై దాడికి తెగబడ్డాడు. ఈ ఘోర దాడిలో నల్లగొండ సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధనగిరి తలకు తీవ్ర గాయమైంది.

### ఆత్మరక్షణ కోసం కాళ్లపై కాల్పులు

నిందితుడి ప్రవర్తన మితిమీరడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. హెడ్ కానిస్టేబుల్‌ను కాపాడుకోవడానికి, ఆత్మరక్షణ కోసం పోలీసులు మొదట గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. అయినప్పటికీ శ్రీకాంత్ లొంగిపోకుండా మరింత రెచ్చిపోవడంతో పోలీసులు అతడి కాళ్లపై కాల్పులు జరిపారు. బుల్లెట్ గాయాలైన శ్రీకాంత్‌ను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. తలకు గాయమైన నిందితుడిని, గాయపడిన హెడ్ కానిస్టేబుల్‌ను చికిత్స నిమిత్తం వనస్థలిపురంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శ్రీకాంత్‌తో పాటు డీసీఎం వాహనంలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు అనుమానితులను కూడా పోలీసులు స్పాట్‌లోనే అరెస్ట్ చేశారు.

### పద్నాలుగేళ్లుగా సాగుతున్న నేరాల పరంపర

పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్‌కు చెందిన భూష్మి శ్రీకాంత్ నేర చరిత్ర వింటే సామాన్యులు హడలెత్తిపోతారు. మొదట్లో చిన్న దొంగతనాలతో కెరీర్ ప్రారంభించిన ఇతడు.. 2007లో తనను అరెస్ట్ చేయడానికి ప్రయత్నించిన కానిస్టేబుల్ వేణుబాబును దారుణంగా హత్య చేసి పారిపోయాడు. అప్పటి నుండి పద్నాలుగేళ్లుగా పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇతనిపై 120కి పైగా తీవ్రమైన నేరారోపణలు ఉన్నాయి. ఒక్క నల్లగొండ జిల్లాలోనే సుమారు 300 వరకు కేసులు నమోదు కావడం గమనార్హం.

### గ్యాంగ్ గుట్టు రట్టు చేసేందుకు విచారణ

నిందితుడి ఆచూకీ కోసం నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. నిత్యం వాహనాలతో బిజీగా ఉండే ఔటర్ రింగ్ రోడ్డుపై ఒక్కసారిగా తుపాకీ శబ్దాలు వినపడటంతో వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. శ్రీకాంత్ అరెస్టుతో రెండు రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న వందలాది దొంగతనాలు, దోపిడీ కేసుల మిస్టరీ వీడుతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇతని వెనుక ఉన్న గ్యాంగ్ వివరాలు, ఆస్తుల సమాచారాన్ని రాబట్టేందుకు పోలీసులు లోతైన విచారణ ప్రారంభించారు.



# మనీ ఛేజింగ్ సెల్




- ఆదాయం పెంపుపై సర్కార్ నజర్
- వృథా ఖర్చులకు అడ్డుకట్ట వేయండి
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ప్రభుత్వ ఆదాయ సమీకరణపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర బడ్జెట్ లక్ష్యాలకు అనుగుణంగా రాబడిని పెంచాలని, ఎక్కడా రూపాయి కూడా వృథా కాకుండా ఆదాయ లీకేజీలను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, గనుల శాఖ వంటి కీలక విభాగాలలో నిరంతర నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. ఆదాయ సమీకరణ ప్రయత్నాలను నిరంతరం పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక "ఛేజింగ్ సెల్" ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.

### టెక్నాలజీతో పారదర్శకత పెంచాలి

ప్రభుత్వ పథకాల అమలులో మరింత పారదర్శకత తీసుకురావడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను ఉపయోగించుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. లబ్ధిదారుల డేటాబేస్‌ను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్, వ్యవస్థతో అనుసంధానం చేయడం ద్వారా నిజమైన పేదలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ వంటి ప్రభుత్వ సంస్థలు తమ పరిధిలో ఆదాయ వనరులను పెంచుకోవడంపై మరింత శ్రద్ధ పెట్టాలని కోరారు. అన్ని శాఖలు తమ పనితీరును మెరుగుపరుచుకుని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో నిర్లక్ష్యం వీడాలని హెచ్చరించారు.

### వాస్తవిక బడ్జెట్‌కే ప్రాధాన్యత

రాబోయే రోజుల్లో ఊహాజనిత అంచనాలతో కాకుండా వాస్తవిక ఆధారాలతోనే బడ్జెట్‌ను రూపొందించుకోవాలని రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికే బడ్జెట్‌లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అభివృద్ధి పనులకు అత్యంత కీలకమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, దీనికి అవసరమైన నిధుల సమీకరణకు ప్రభుత్వం నుండి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రగతి అజెండాను సమర్థవంతంగా అమలు చేయడానికి కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ పాటించక తప్పదని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేడు కేబినెట్ అత్యవసర భేటీ

- మూసీ, మెట్రోలపై ప్రధాన చర్చ
- కీలక నిర్ణయాలు తీసుకునే ఛాన్స్



రాష్ట్ర మంత్రిమండలి కీలక సమావేశం ఇవాళ మధ్యాహ్నం 3:00 గంటలకు జరగనుంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఈ 34వ మంత్రిమండలి భేటీని నిర్వహించనున్నారు. సచివాలయం ఆరో అంతస్తులో ఉన్న కేబినెట్ సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఈ సమావేశం ప్రారంభం కానుంది. ఈ ముఖ్యమైన భేటీ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. కేబినెట్ సమావేశం జరిగే సమయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులందరూ తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్‌లోనే అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

### మూసీ, మెట్రోలపై ప్రధాన చర్చ

ఈ కేబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రగతికి సంబంధించిన పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టుకు అధికారికంగా ఆమోదం తెలిపింది. దీనితో పాటు హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ ప్రాజెక్టుకు కూడా కేంద్రం పచ్చజెండా ఊపింది. ఈ నేపథ్యంలో ఈ రెండు భారీ ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో వేగంగా ఎలా ముందుకు తీసుకెళ్లాలనే వ్యూహంపై మంత్రిమండలి ప్రధానంగా దృష్టి పెట్టనుంది. నిధుల సమీకరణ, పనుల కేటాయింపులపై ఈ భేటీలో ముందడుగు పడే అవకాశం ఉంది.

# దండుపాళ్యం ముఠాలా దోచుకుంటున్నారు

- ఇజ్జత్ పోయేదానికి ఢిల్లీకి ఎందుకు వెళ్లాలి
- తెలంగాణను పదేపదే కించ పరుస్తున్నారు
- ప్రపంచమంతా కాళేశ్వరాన్ని అభినందించింది
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం
- తేదీ, సమయం చెబితే రావడానికి రెడీ
- రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్



కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు ఇచ్చిన అధికార కాలంలో ఇప్పటికే యాభై శాతం గడువు ముగిసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ కాలంలో తాము ఏం చేశామో చెప్పుకోవడానికి కాంగ్రెస్ వద్ద ఎలాంటి సమాధానం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేవలం అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. అప్పుల కోసం ఢిల్లీకి వెళ్తే తెలంగాణ ఇజ్జత్ పోతుందని మాట్లాడే సీఎం రేవంత్ రెడ్డి.. ఈ కొద్ది కాలంలోనే ఎందుకు డెబ్బై రెండు సార్లు ఢిల్లీ పర్యటనలు చేశారని కేటీఆర్ నిలదీశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరిస్తూ తిరిగి గట్టి కౌంటర్ ఇచ్చారు.

### కేసీఆర్ హయాంలో కోటి ఎకరాల మాగాణి

తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కోటి ఎకరాల మాగాణిగా మార్చారని కేటీఆర్ స్పష్టం చేశారు. భారాస అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి కేవలం ఇరవై ఆరు లక్షల హెక్టార్లలో మాత్రమే ఉండగా.. కేసీఆర్ దిగిపోయే నాటికి అది యాభై తొమ్మిది లక్షల హెక్టార్లకు పెరిగిందని గణాంకాలతో వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతాన్ని చూసి ప్రపంచమంతా అభినందించిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో వివక్ష చూపించినా భారాస ప్రభుత్వం పదేళ్లలో అద్భుతమైన ప్రగతి సాధించిందని చెప్పారు. హైదరాబాద్ నగరాన్ని చూసి న్యూయార్క్ లా ఉందని సూపర్ స్టార్ రజనీకాంత్ ప్రశంసించారని.. మేఘాలయ సీఎం, ఫాక్స్‌కాన్ ఛైర్మన్ వంటి ఎందరో ప్రముఖులు ఇక్కడి అభివృద్ధిని కొనియాడారని పేర్కొన్నారు.

### తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయవద్దు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే తెలంగాణ సమాజాన్ని కించపరుస్తూ మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రాజకీయంగా తమను ఎంతైనా దూషించుకోవచ్చని, కేసులు పెట్టుకోవచ్చని.. కానీ తెలంగాణ ప్రజల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడవద్దని హెచ్చరించారు. ఇంతటి భావదారిద్ర్యం ఉన్న ముఖ్యమంత్రిని తాము ఎప్పుడూ చూడలేదన్నారు. పరిపాలన చేయడం చేతకాక ఎల్లప్పుడూ గత ప్రభుత్వంపై ఏడవడం రేవంత్‌కు అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులు దండుపాళ్యం ముఠాలా మారి రాష్ట్ర ఆస్తులను దోచుకుంటున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ బంధువులు, మంత్రుల బంధువుల పేరిట జరుగుతున్న దోపిడీని వెంటనే బంద్ చేయాలని డిమాండ్ చేశారు.

### ఏ చౌరస్తాలోనైనా చర్చకు నేను రెడీ

భారాస, కాంగ్రెస్ పదేళ్ల పాలనపై చర్చకు తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ ప్రకటించారు. దీనికోసం రేవంత్ రెడ్డి తేదీ, సమయం ఖరారు చేయాలని సవాల్ విసిరారు. చర్చ అసెంబ్లీలోనా, ప్రెస్ క్లబ్‌లోనా లేక జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లోనా ఎక్కడైనా తాను రావడానికి సిద్ధమన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్ చౌరస్తా అయినా.. రెండు లక్షల ఉద్యోగాలంటూ రాహుల్ గాంధీ హామీ ఇచ్చిన అశోక్ నగర్ చౌరస్తా అయినా తాము సిద్ధమేనని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి వస్తారో లేక రాహుల్ గాంధీని తెచ్చుకుంటారో రావచ్చని.. కాంగ్రెస్ తప్పులను లెక్కలతో సహా బయటపెడతానని కేటీఆర్ సవాల్ చేశారు. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టలేకపోతే తాను శాశ్వతంగా రాజకీయాల నుండి తప్పుకుంటానని సంచలన ప్రకటన చేశారు.

# రైతుల పేరిట రేవంత్ సర్కార్ కొత్త డ్రామాలు



- వైఫల్యాల నుండి దృష్టి మరల్చే ఎత్తుగడలు
- కాంగ్రెస్ వైఫల్యాలపై హరీశ్ రావు నిప్పులు

కాంగ్రెస్ ప్రభుత్వం తాము ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శిల్పకళావేదిక సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని పక్కదారి పట్టించేందుకే రేవంత్ రెడ్డి రైతుల పేరుతో కొత్త డ్రామాలకు తెరతీశారని మండిపడ్డారు. రైతు భరోసా పేరుతో కేవలం పబ్లిసిటీ స్టంట్లు చేస్తూ, అన్నదాతల అసలు సమస్యలను పక్కన పెట్టేసి గొప్పలు చెప్పుకోవడం తప్ప ఈ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదని హరీశ్ రావు విమర్శించారు.

### సీఎం, డిప్యూటీ సీఎంల కల్పిత లెక్కలు

ప్రభుత్వం చెబుతున్న ఆర్థిక గణాంకాల్లోని డొల్లతనాన్ని హరీశ్ రావు ఆధారాలతో సహా ఎండగట్టారు. ఒకే సభలో ఉంటూ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రైతుల కోసం 1.56 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చెబితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం 1.75 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చెబుతున్నారని.. అసలు వీరిద్దరిలో ఎవరి లెక్కలు నిజమని ఆయన ప్రశ్నించారు. 2027 మార్చి 31 వరకు వ్యవసాయ రంగానికి చేసిన మొత్తం బడ్జెట్ కేటాయింపులే సుమారు 82 వేల కోట్ల రూపాయలు అయితే.. జూన్ 2026 నాటికే లక్షల కోట్ల రూపాయలు ఎలా ఖర్చు చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. బడ్జెట్‌లో లేని డబ్బును ఖర్చు చేశారా లేక రైతులను మభ్యపెట్టడానికి కల్పిత లెక్కలు చెబుతున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### రుణమాఫీ పేరుతో దారుణమైన మోసం

ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి ఓట్లు అడిగారని హరీశ్ రావు గుర్తు చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక ఇప్పుడు కేవలం స్వల్పకాలిక రుణాలకే మాఫీ వర్తిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పడం రైతులను దారుణంగా మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ఈ నిబంధన ముందే చెప్పి ఉంటే రైతులు కాంగ్రెస్‌ను నమ్మేవారా అని అడిగారు. మేనిఫెస్టోలో ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట చెప్పడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనమన్నారు. ఫేక్ ప్రచారాలు ఆపి రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని.. లేనిపక్షంలో రైతులే ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను ఎలా గాలికి వదిలేశారో నిరూపించడానికి అసెంబ్లీతో పాటు ఏ వేదికపైనైనా చర్చకు తాము సిద్ధమని హరీశ్ రావు సవాల్ విసిరారు.



# బీదర్ చెత్త రగడ

- సరిహద్దుల్లో వేస్ట్ ఫైటింగ్
- కర్ణాటక మున్సిపాలిటీ దౌర్జన్యం
- అంతర్రాష్ట్ర రహదారిపై చెత్త కుమ్మరింపు

తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య సరిహద్దు ప్రాంతంలో చెత్త వివాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. కర్ణాటకలోని బీదర్ మున్సిపాలిటీ తమ నగరానికి చెందిన టన్నుల కొద్దీ వ్యర్థాలను, మురికిని తెచ్చి తెలంగాణ పరిధిలోని మల్గి గ్రామ శివారులో పారబోస్తోంది. ఈ అక్రమ డంపింగ్ యార్డు కారణంగా స్థానికంగా గాలి, నీరు పూర్తిగా కలుషితమైపోయాయి. విపరీతమైన దుర్వాసనతో మల్గి గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకోలేక అల్లాడిపోతున్నారు. గ్రామంలో దోమలు, ఈగలు పెరిగిపోయి చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారు. తమ ఊరిని రోగాల మయం చేస్తున్న కర్ణాటక అధికారుల వైఖరిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### వాహనాల ముట్టడితో పెరిగిన ఉద్రిక్తత

తమ ఆరోగ్యాలను పణంగా పెడుతూ ఇష్టానుసారంగా చెత్త వేయడాన్ని వ్యతిరేకిస్తూ మల్గి గ్రామస్థులు గత పదిహేను రోజులుగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం బీదర్ నుండి చెత్తతో వచ్చిన మున్సిపల్ వాహనాలను గ్రామ సరిహద్దులోనే రైతులు, మహిళలు అడ్డుకున్నారు. తమ భూముల్లోకి చెత్త వాహనాలను రానిచ్చేది లేదంటూ రహదారిపై బైఠాయించారు. దీనితో ఆగ్రహించిన బీదర్ మున్సిపల్ సిబ్బంది, అధికారులు గ్రామస్థులను తీవ్రంగా బెదిరించారు. 'మా చెత్తను అడ్డుకుంటే మీరు బీదర్ నగరానికి ఎలా వస్తారో చూస్తాం' అంటూ హెచ్చరిస్తూ సుమారు 40 వాహనాల చెత్తను బీదర్‌మల్గి ప్రధాన రహదారిపైనే కుమ్మరించారు.

### కిలోమీటర్ల మేర నిలిచిన రాకపోకలు

మున్సిపల్ సిబ్బంది దౌర్జన్యంగా అంతర్రాష్ట్ర రహదారిపై చెత్తను పారబోయడంతో రోడ్డంతా నరకప్రాయంగా మారింది. కంపు వాసన, చెత్త కుప్పల కారణంగా ఆ మార్గంలో ప్రయాణించడం అసాధ్యంగా మారింది. దీనితో తెలంగాణ, కర్ణాటక మధ్య నడిచే ఆర్టీసీ బస్సులు, నిత్యావసరాల లారీలు, కార్లు నిలిచిపోయాయి. రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు స్తంభించిపోవడంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న సంగారెడ్డి జిల్లా పోలీసులు, రెవెన్యూ అధికారులు కర్ణాటక పోలీసులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించే పనులను ప్రారంభించారు. తమ గ్రామం నుండి డంపింగ్ యార్డును శాశ్వతంగా తొలగించే వరకు వెనక్కి తగ్గేదే లేదని మల్గి ప్రజలు తెగేసి చెబుతున్నారు.

# కల్వకుంట్ల కవిత కొత్త పార్టీకి బ్రేక్..!?

- టీఆర్ఎస్ పేరుపై ఈసీకి ఫిర్యాదులు
- సీన్‌లోకి కేంద్ర ఎన్నికల సంఘం
- టీఆర్ఎస్ పేరుపై అభ్యంతరాల వెల్లువ




కల్వకుంట్ల కవిత కొత్తగా స్థాపించిన రాజకీయ పార్టీ రిజిస్ట్రేషన్‌కు గట్టి బ్రేక్ పడింది. ఆమె తన నూతన పార్టీకి "తెలంగాణ రక్షణ సమితి" అని పేరు పెట్టి.. దానికి సంక్షిప్తంగా "టీఆర్ఎస్" అనే అక్షరాలను ఎంచుకున్నారు. అయితే ఈ పేరుపై భారత ఎన్నికల సంఘానికి రికార్డు స్థాయిలో అభ్యంతరాలు వచ్చాయి. దాదాపు 600 నుండి 700 వరకు ఫిర్యాదులు రావడంతో ఈసీ ప్రస్తుతం ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను హోల్డ్‌లో పెట్టింది. దీంతో కవిత స్వతంత్ర రాజకీయ ప్రస్థానానికి ఆరంభంలోనే ఒక పెద్ద చట్టపరమైన చిక్కు వచ్చి పడింది.

### ఓటర్లలో అయోమయం సృష్టించే కుట్ర

ఈ అభ్యంతరాలలో అత్యధిక భాగం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మద్దతుదారుల నుండి వచ్చినవే కావడం గమనార్హం. గతంలో తెలంగాణ రాష్ట్ర సమితిగా ఉండి ప్రస్తుతం భారత రాష్ట్ర సమితిగా మారిన తమ పార్టీ పూర్వ వైభవాన్ని, ఓటర్ల సెంటిమెంట్‌ను కవిత వాడుకోవాలని చూస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన "టీఆర్ఎస్" అనే పేరును కొత్త పార్టీకి కేటాయిస్తే ఓటర్లలో తీవ్రమైన అయోమయం నెలకొంటుందని బీఆర్ఎస్ శ్రేణులు వాదిస్తున్నాయి. ఒకే రకమైన ఉచ్చారణ, దృశ్యరూపం ఉన్న అక్షరాలను కేటాయించవద్దని వారు ఈసీని కోరారు.

### కుటుంబంలో పొలిటికల్ వార్

కవిత తన తండ్రి కేసీఆర్, సోదరుడు కేటీఆర్ రాజకీయ సిద్ధాంతాల నుండి విడిపోయి సొంతంగా ఈ పార్టీని ఏర్పాటు చేశారు. అసలైన తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి తానే నిజమైన వారసురాలినని నిరూపించుకోవడానికి ఆమె ఈ వ్యూహాన్ని ఎంచుకున్నారు. అయితే ఈ పేరు వివాదంతో ఇది కాస్త కుటుంబ సభ్యుల మధ్య ఒక పెద్ద రాజకీయ పోరాటంగా రూపాంతరం చెందింది. ఈ అభ్యంతరాలపై కవిత ప్రతినిధులు ఇప్పటికే కొన్ని వివరణలు ఇచ్చినప్పటికీ, పూర్తి ఫైల్ అందిన తర్వాత మిగిలిన వాటికి సమాధానం ఇస్తామని చెప్తున్నారు. ఈ చారిత్రక పేరు కవితకు దక్కుతుందో లేదో తెలియాలంటే ఈసీ తుది నిర్ణయం వరకు వేచి చూడాల్సిందే.

# మెటాకు మూడే రోజులు గడువు

- వాట్సాప్ కొత్త ఫీచర్‌పై కేంద్రం ఉక్కుపాదం
- యూజర్ నేమ్స్ నిలిపేయాలని నోటీసులు



ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ తీసుకురానున్న సరికొత్త 'యూజర్ నేమ్స్' ఫీచర్‌పై భారత ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఫీచర్ రోల్ అవుట్‌కు సంబంధించి వాట్సాప్ మాతృసంస్థ మెటాకు కేంద్ర ప్రభుత్వం తాజాగా అత్యవసర నోటీసులు జారీ చేసింది. ఈ కొత్త ఫీచర్ గురించిన పూర్తి వివరాలు, వివరణలను మూడు రోజుల్లోగా సమర్పించాలని ఐటీ శాఖ మెటాను ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వంతో సంప్రదింపులు, సమీక్ష పూర్తయ్యే వరకు భారతదేశంలో ఈ ఫీచర్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావద్దని కేంద్రం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

### టెలిగ్రామ్ తరహా ముప్పు పొంచి ఉందా

వాట్సాప్ తీసుకురాబోయే ఈ కొత్త అప్‌డేట్ ప్రకారం.. వినియోగదారులు తమ మొబైల్ నంబర్లను ఇతరులతో పంచుకోకుండా కేవలం ఒక యూజర్ నేమ్ ద్వారా చాట్ చేసుకునే అవకాశం లభిస్తుంది. దీనిని ప్రైవసీని పెంచే ఫీచర్‌గా మెటా ప్రచారం చేస్తోంది. అయితే దీనివల్ల సైబర్ నేరగాళ్లను, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని గుర్తించడం దర్యాప్తు సంస్థలకు అత్యంత క్లిష్టంగా మారుతుందని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇటీవల పేపర్ లీకేజీల వంటి నేరాల్లో టెలిగ్రామ్ యాప్ వేదికగా మారిన విషయాన్ని అధికారులు గుర్తు చేస్తున్నారు. టెలిగ్రామ్‌లో ఇలాంటి అజ్ఞాత ఫీచర్లు ఉండటం వల్లే అది సైబర్ నేరగాళ్లకు డార్క్ వెబ్‌లా మారిందని కేంద్రం కోర్టుకు సైతం తెలిపింది.

### దర్యాప్తు సంస్థలకు కొత్త సవాలు

ప్రస్తుతం వాట్సాప్‌లో ఒకరిని గుర్తించడానికి మొబైల్ నంబర్ ప్రధాన ఆధారంగా ఉంది. ఈ కొత్త ఫీచర్ వస్తే పెద్ద పెద్ద గ్రూపుల్లో నంబర్లు కనిపించకుండా దాచుకునే వీలుంటుంది. దీనివల్ల సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం వ్యాప్తి చేసేవారిని, నేరగాళ్లను పట్టుకోవడం శాంతిభద్రతల విభాగాలకు పెద్ద సవాలుగా మారుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ వారంలోనే యూజర్ నేమ్స్ రిజర్వ్ చేసుకునే ప్రక్రియను ప్రారంభించి, రాబోయే నెలల్లో పూర్తిగా అందుబాటులోకి తేవాలని మెటా ప్లాన్ చేసింది. కానీ భారత ప్రభుత్వ భద్రతా ఆందోళనల నేపథ్యంలో ఈ ఫీచర్ లీగల్ స్క్రీనింగ్‌ను ఎదుర్కొంటోంది. వినియోగదారుల వ్యక్తిగత గోప్యత ఎంత ముఖ్యమో, దేశ భద్రత, నేరాల అదుపు కూడా అంతే ముఖ్యమని కేంద్రం స్పష్టం చేస్తోంది.

దేవుడి హుండీ నుంచి మాయమైన విరాళాలు ఇప్పుడు ఉత్తరప్రదేశ్ రాజకీయాలను కుదిపేస్తున్నాయి. అయోధ్య రామాలయ విరాళాల చోరీ కేసు సాధారణ క్రిమినల్ కేసు స్థాయిని దాటి ఎన్నికల అస్త్రంగా మారింది. కుంభమేళా సమయంలోనే కోట్లాది రూపాయల విరాళాలు పక్కదారి పట్టాయని దర్యాప్తులో వెలుగుచూసిన అంశాలు సంచలనం రేపుతున్నాయి. బావమరదుల స్కెచ్, ఎస్బీఐ సిబ్బంది సహకారం, ట్రస్ట్ మాజీ కార్యదర్శి డ్రైవర్ వద్ద తాళంచెవి ఉండటం, దుప్పట్ల మధ్య దాచిన నగదు, ఆస్తుల కొనుగోళ్లు వంటి అంశాలు భక్తుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిలిస్తున్నాయి. ఇదే సమయంలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీ కలిసి ఈ వివాదాన్ని బీజేపీపై బ్రహ్మాస్త్రంగా మలుస్తుండగా, సీఎం యోగి ఆదిత్యనాథ్ హిందూత్వ అజెండాతో ప్రతిదాడికి దిగారు. ఇదే సమయంలో ఉద్యోగాల నియామకాల పేరుతో భారీ కమిషన్ల దందా జరిగినట్లు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రా సిఫార్సులతో వందలాది నియామకాలు జరిగాయని, వాటి కోసం భారీ వసూళ్లు జరిగినట్లు సిట్ గుర్తించింది. విరాళాల చోరీ కేసు విచారణ ఇప్పుడు ఉద్యోగాల అక్రమాలపై కూడా కేంద్రీకృతమైంది. మరోవైపు అసదుద్దీన్ ఒవైసీ చేసిన ఎన్‌కౌంటర్, బుల్డోజర్ వ్యాఖ్యలు రాజకీయ వేడిని మరింత పెంచాయి. కోట్లాది మంది భక్తుల విశ్వాసం, ఆలయ నిధుల భద్రత, ట్రస్ట్ పారదర్శకత, అధికార పార్టీ విశ్వసనీయత అన్నీ ఒకేసారి పరీక్షకు నిలిచిన ఈ వ్యవహారం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల తీర్పును ఎంతవరకు ప్రభావితం చేస్తుందన్నది ఇప్పుడు దేశ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# రామాలయ విరాళాల లూటీ

## యూపీ ఎన్నికల్లో రాజకీయ సునామీ!



## బావమరదుల ఘరానా

# రామాలయ లూటీ

### కుంభమేళా సమయంలోనే కుట్ర మొదలు

అయోధ్య రామాలయ విరాళాల చోరీ కేసు దర్యాప్తులో పోలీసులు సంచలన విషయాలను గుర్తించారు. గత ఏడాది జరిగిన కుంభమేళా సమయంలోనే ఆలయంలో అత్యధికంగా దొంగతనం జరిగినట్లు అయోధ్య పోలీసులు వెల్లడించారు. ఆ సమయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో విరాళాలు, కానుకలు భారీగా వచ్చాయి. నిందితులు ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని పెద్ద ఎత్తున నగదును లూటీ చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది నిందితులను ప్రత్యేక దర్యాప్తు బృందం.. సిట్ అరెస్టు చేసింది.

**బావమరదుల భారీ స్కెచ్**

ఈ భారీ దొంగతనంలో లవ్‌కుష్ మిశ్రా, అనుకల్ప్ మిశ్రా అనే బావమరదుల పాత్ర అత్యంత కీలకంగా ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. వీరిద్దరే ఆలయం నుండి అత్యధిక మొత్తంలో నగదును దొంగిలించారు. ఈ దొంగతనం సొమ్ముతో వారు పలు చోట్ల ఆస్తులను కొనుగోలు చేశారు. ఇప్పటివరకు వారికి సంబంధించిన అర డజనుకు పైగా ఆస్తులను పోలీసులు గుర్తించారు. వీరి ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల వివరాలను పరిశీలించడానికి పోలీసులు ఆదాయపు పన్ను శాఖ సహాయం తీసుకుంటున్నారు.

**బ్యాంకు సిబ్బంది సహకారం**

ఈ దొంగతనంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయంలో విరాళాల లెక్కింపు బాధ్యతలను ఎస్‌బీఐ పర్యవేక్షిస్తుంది. విరాళాల లెక్కింపు గదికి సంబంధించిన ఒక తాళంచెవి ట్రస్ట్ మాజీ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ డ్రైవర్ తిన్ను యాదవ్ వద్ద ఉండేది. రెండో తాళంచెవి బ్యాంకు సిబ్బంది వద్ద ఉండేది. వీరిద్దరూ పరస్పరం సహకరించుకుంటూ విరాళాల సొమ్మును పక్కదారి పట్టించి, ఆ డబ్బును వాటాలుగా పంచుకున్నట్లు సమాచారం.

**దుప్పట్లలో దాచిన నోట్ల కట్టలు**

నిందితుడు అవినాష్ శుక్లాకు చెందిన కౌశల్‌పురి స్థావరం నుండి పోలీసులు భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఉన్న ఒక యోగా కేంద్రంలో సోదాలు నిర్వహించగా, 4 పెట్టెల్లో దుప్పట్ల మధ్య దాచిన నోట్ల కట్టలు బయటపడ్డాయి. అందులో ఒక పెట్టెపై 'రామరాజ్య కోష్' అని రాసి ఉంది. నిందితుల ఇళ్లలో జరిపిన తనిఖీల్లో వారి సంపాదనకు మించిన బ్యాంక్ లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు అవినాష్ శుక్లా ఇచ్చిన సమాచారం ఆధారంగా మొదట ₹89 లక్షల నగదును రికవరీ చేశారు. దీనిపై లోతైన విచారణ జరపాలని పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కి లేఖ రాయనున్నారు.

## రామాలయ విరాళాల

# చోరీ వివాదం

- ఎన్నికలపై చోరీ ప్రభావం
- యూపీలో రాజుకున్న రాజకీయం
- ప్రతిపక్షాల చేతికి బ్రహ్మాస్త్రం

అయోధ్య రామాలయంలో విరాళాల దొంగతనం, నిధుల దుర్వినియోగం ఉమ్మడి ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. వచ్చే ఏడాది ప్రారంభంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపక్షాలు ఈ అంశాన్ని ఒక పెద్ద రాజకీయ అస్త్రంగా మార్చుకున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్, బహుజన్ సమాజ్ పార్టీలు ఒకేతాటిపైకి వచ్చి అధికార బీజేపీని గట్టిగా నిలదీస్తున్నాయి. దశాబ్దాలుగా హిందూత్వ, మత విశ్వాసాల ప్రాతిపదికన రాజకీయం చేస్తున్న అధికార పార్టీని అదే అంశంపై దెబ్బకొట్టేందుకు ప్రతిపక్ష కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు కేవలం రామాలయ నిర్మాణ ఘనతను మాత్రమే ప్రచారం చేసుకున్న బీజేపీకి, ఈ విరాళాల లెక్కింపు అవకతవకలు ఒక పెద్ద తలనొప్పిగా మారాయి.

**భక్తుల భావోద్వేగాలతో ముడిపడిన అంశం**

ఈ వివాదం తీవ్రత చాలా ఎక్కువగా ఉండటానికి కారణం ఇందులో సాధారణ భక్తుల భాగస్వామ్యం ఉండటమే. దేశవ్యాప్తంగా సాగిన విరాళాల సేకరణలో లక్షలాది మంది ప్రజలు దాదాపు 3,500 కోట్ల రూపాయలను ఆలయ నిర్మాణం కోసం ఇచ్చారు. నగదుతో పాటు బంగారం, వెండి వంటి విలువైన కానుకలను సమర్పించారు. ఇప్పుడు ఈ విరాళాల సేఫ్టీపై నీలినీడలు కమ్ముకోవడంతో భక్తులలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. తాము భక్తితో వేసిన కానుకలను కొందరు అక్రమార్కులు లూటీ చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ అసంతృప్తి ఇలాగే కొనసాగితే ఎన్నికల్లో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని బీజేపీ అంతర్గత వర్గాలు కూడా అంగీకరిస్తున్నాయి.

**మథుర వైపు మళ్లించే ప్రయత్నం**

ఈ రాజకీయ సవాలును తిప్పికొట్టేందుకు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రయత్నిస్తున్నారు. విరాళాల అంశం నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఆయన మళ్లీ తన సొంత హిందూత్వ ఎజెండాను ముందుకు తెచ్చారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌కు ఆయన బహిరంగ సవాలు విసిరారు. అఖిలేష్ యాదవ్‌కు నిజంగానే దేవుడిపై భక్తి ఉంటే మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ములాయం సింగ్ యాదవ్ ప్రభుత్వ హయాంలో రామభక్తులపై జరిగిన కాల్పుల ఉదంతాన్ని కూడా ఆయన గుర్తు చేశారు. బాబ్రీ మసీదుకు మద్దతు ఇచ్చిన వారికి రామాలయం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని బీజేపీ నేతలు గట్టిగా వాదిస్తున్నారు.

**పోరాటాన్ని ఉధృతం చేసిన కాంగ్రెస్**

బీజేపీ విమర్శలను తిప్పికొడుతూ కాంగ్రెస్ పార్టీ ఈ అంశంపై మరింత దూకుడుగా వ్యవహరిస్తోంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం అయోధ్య పర్యటనకు వెళ్ళింది. అయితే వారిని ఆలయానికి వెళ్లకుండా యంత్రాంగం అడ్డుకుని, ప్రభుత్వ అతిథి గృహంలో గృహనిర్బంధం చేసింది. దీనిపై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దేవుడి దర్శనానికి కూడా అనుమతించకపోతే తాము నిరాహార దీక్షకు కూర్చుంటామని హెచ్చరించింది. దొంగతనం చేసిన వారిని కాపాడుతూ, భక్తులను అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించింది. తాము దేవుడికి వ్యతిరేకం కాదని, కేవలం ఆలయ ట్రస్ట్‌లో జరుగుతున్న అవినీతిని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేసింది.

**మాయావతి డిమాండ్ - సరికొత్త రాజకీయం**

మరోవైపు బీఎస్పీ అధినేత్రి మాయావతి కూడా ఈ వివాదంలోకి ప్రవేశించారు. రామాలయ విరాళాల దొంగతనంపై వస్తున్న కథనాలు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయని ఆమె సామాజిక మాధ్యమాల ద్వారా పేర్కొన్నారు. ఈ అంశాన్ని రాజకీయం చేయకుండా, దేశంలోని ఇతర పెద్ద దేవాలయాల తరహాలో ఇక్కడ కూడా విరాళాల లెక్కింపునకు ఒక పారదర్శకమైన విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. గతంలో రామాలయ ప్రారంభోత్సవానికి దూరంగా ఉన్న ప్రతిపక్షాలు, ఇప్పుడు నేరుగా ఆలయ మేనేజ్‌మెంట్‌ను టార్గెట్ చేయడం యూపీ రాజకీయాల్లో ఒక సరికొత్త మార్పునకు సంకేతంగా కనిపిస్తోంది. కోట్లాది మంది భక్తులలో మళ్లీ నమ్మకాన్ని నింపడం ఇప్పుడు బీజేపీ ముందున్న అతిపెద్ద సవాలు.

# ఉద్యోగాల పేరిట భారీ వసూళ్లు

- దర్యాప్తులో తేలిన మాజీ ట్రస్టీ లీలలు
- ఉద్యోగాల్లో కమిషన్ల దందా
- విచారణలో దొరికిన మాజీ ట్రస్టీ

అయోధ్య రామాలయ విరాళాల చోరీ కేసు దర్యాప్తు ముదురుతున్న కొద్దీ సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. ఈ స్కామ్‌లో రామాలయ ట్రస్ట్ మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రా పేరు ప్రధానంగా వినిపిస్తోంది. పోలీసులు అరెస్ట్ చేసిన నిందితుడు అవినాష్ మిశ్రాను విచారించగా.. అనిల్ మిశ్రా పేరును పలుమార్లు ప్రస్తావించినట్లు సమాచారం. ఈ వివాదం కారణంగానే అనిల్ మిశ్రా, జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ గత వారం తమ పదవులకు రాజీనామా చేశారు. వీరిద్దరిని ప్రత్యేక దర్యాప్తు బృందం ఇప్పటికే సుదీర్ఘంగా ప్రశ్నించింది.





**బంధువులకు పైరవీలు.. కోట్ల ఆస్తులు**

ఆలయంలో పనిచేస్తున్న చాలా మంది ఉద్యోగులు అనిల్ మిశ్రా సిఫార్సుతోనే ఉద్యోగాలు పొందినట్లు విచారణలో తేలింది. కనీసం 125 మంది సిబ్బంది ఆయన రికమండేషన్‌తోనే కొలువులు సాధించగా.. అందులో కొందరు ఆయన సొంత బంధువులు కూడా ఉన్నారు. ఈ ఉద్యోగాల నియామకాల కోసం అనిల్ మిశ్రా భారీగా కమిషన్లు తీసుకున్నారనే ఆరోపణలపై సిట్ దృష్టి సారించింది. ఆయన ట్రస్టీ అయిన తర్వాత ఆస్తులు ఎంత పెరిగాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆయనకు సంబంధించిన పలు ఆస్తులను అధికారులు గుర్తించారు.

**సీసీటీవీల కళ్లుగప్పి నగదు మాయం**

ఈ కేసులో అరెస్ట్ అయిన నిందితులు లవకుష్ మిశ్రా, అనుకల్ప్ మిశ్రాలు అనిల్ మిశ్రాకు దగ్గరి బంధువులని తెలుస్తోంది. ట్రస్ట్ పెద్దలతో ఉన్న సాన్నిహిత్యం వల్ల వీరికి ఆలయంలో ఎదురే లేకుండా పోయింది. విరాళాల లెక్కింపు గది తాళాలు ఉండే తిన్ను యాదవ్ అనే నిందితుడు వీరికి దొంగతనం సులువుగా మారేలా సహకరించాడు. కెమెరాల కళ్లు గప్పడానికి వీరంతా ఒక ప్లాన్ ప్రకారం వ్యవహరించేవారు. ఒకరు డబ్బు తీసుకుంటుంటే మిగిలిన వారు చుట్టూ నిలబడి కెమెరాలకు అడ్డుగా ఉండేవారు. ఆ సొమ్మును బాత్‌రూమ్‌లో దాచి ఆ తర్వాత బయటకు తరలించేవారు. ఈ లూటీలో బ్యాంకు సిబ్బంది వాటా కూడా ఉన్నట్లు సమాచారం.

# చంపత్ రాయ్ మజా చేస్తున్నారు

- ముస్లిం ఉంటే ఎన్‌కౌంటర్ చేసేవారు
- విరాళాల చోరీపై ఒవైసీ సంచలన వ్యాఖ్యలు

అయోధ్య రామాలయ విరాళాల చోరీ వివాదంపై ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ బీజేపీ, ఆర్ఎస్ఎస్, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ ఈ రామాలయ ట్రస్ట్‌లో ఎవరైనా ముస్లిం సభ్యుడిగా ఉండి ఉంటే.. ఈ పాటికి ప్రభుత్వం అతడిని ఎన్‌కౌంటర్ చేసి ఉండేదని లేదా బుల్డోజర్లతో అతడి ఇల్లు కూల్చివేసి కేసు క్లోజ్ చేసేవారని ఒవైసీ వ్యాఖ్యానించారు. నిందితుల గుర్తింపును బట్టి చర్యలు తీసుకోవడంలో భిన్నమైన ప్రమాణాలు పాటిస్తున్నారని ఆయన ఆరోపించారు.

**చంపత్ రాయ్ పై ఒవైసీ వ్యంగ్యాస్త్రాలు**

ఈ దొంగతనం వ్యవహారంలో ట్రస్ట్ మాజీ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ హాయిగా మజా చేస్తున్నారంటూ ఒవైసీ వ్యంగ్యంగా విమర్శించారు. కేసులో నిందితులుగా ఉన్నవారి ఇళ్లను ఎందుకు కూల్చడం లేదని ఆయన ప్రశ్నించారు. అరెస్ట్ అయిన నిందితులను పోలీసులు కస్టడీలోకి కూడా తీసుకోలేదని ఆరోపించారు. బహుశా తన ప్రకటన తర్వాత అయినా పోలీసులు వారిని కస్టడీకి తీసుకుంటారేమోనని వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు ఈ పరిణామాలు అద్దం పడుతున్నాయని, ముస్లిం సమాజం అంతా ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

**బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు సూటి ప్రశ్న**

ఈ లూటీ వ్యవహారంలో చంపత్ రాయ్ మీకు ఇష్టమైన వ్యక్తినా కాదా అని ఒవైసీ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను సూటిగా ప్రశ్నించారు. మమ్మల్ని పాకిస్తానీలు, జిహాదీలు లేదా బంగ్లాదేశీయులు అని పిలిచే ఈ శక్తులు.. పాకిస్తాన్‌తో ఎందుకు దౌత్య చర్చలు జరుపుతున్నాయని నిలదీశారు. పహల్గామ్ దాడిలో ఉగ్రవాదులు 26 మందిని చంపిన పాకిస్తాన్‌తో ఆర్ఎస్ఎస్ తరఫున రామ్ మాధవ్ ఎందుకు చర్చలు జరుపుతున్నారని ప్రశ్నించారు. ఈ కేసులో నిందితులుగా ఒక ముస్లిం ఉంటే అధికారులు స్పందించే తీరు అత్యంత కఠినంగా ఉండేదని ఒవైసీ స్పష్టం చేశారు.

---

భారత్, పాకిస్తాన్‌ల మధ్య దౌత్య సంబంధాలను పునరుద్ధరించాలని, జమ్మూ కశ్మీర్ అంశంపై చర్చలను మళ్లీ ప్రారంభించాలని కోరుతూ ఇరు దేశాలకు చెందిన 117 మంది ప్రముఖులు ఒక సంయుక్త బహిరంగ లేఖను విడుదల చేశారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లను ఉద్దేశించి ఈ లేఖను రాశారు. 'సెంటర్ ఫర్ పీస్ అండ్ ప్రోగ్రెస్' సంస్థ ఛైర్మన్ ఒ.పి. షా నేతృత్వంలో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. దక్షిణ ఆసియా ప్రాంతంలో శాశ్వత శాంతిని స్థాపించడానికి, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని, ద్వైపాక్షిక చర్చలను వెంటనే ప్రారంభించాలని ఈ లేఖలో ప్రముఖులు డిమాండ్ చేశారు. ఈ లేఖపై ఫరూక్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ, రా మాజీ చీఫ్ ఎ.ఎస్. దులాత్ వంటి భారతీయ ప్రముఖులతో పాటు పాక్ మాజీ విదేశాంగ మంత్రి ఖుర్షీద్ మహ్మద్ కసూరి కూడా సంతకాలు చేశారు. అయితే ఈ లేఖను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ తీవ్రంగా ఖండించారు. ఇది ఇస్లామాబాద్ ఎజెండాను సమర్థించేలా ఉందని, ఉగ్రవాదం, చర్చలు కలిసి సాగవని ఆయన స్పష్టం చేశారు.

# శాంతి మంత్రం

- భారత్, పాక్ ప్రధానులకు బహిరంగ లేఖ
- సరిహద్దుల్లో శాంతి కోసం సంయుక్త పిలుపు
- రంగంలోకి 100 మందికి పైగా ప్రముఖులు

భారత్, పాకిస్తాన్‌ల మధ్య దౌత్య సంబంధాలను పునరుద్ధరించాలని, జమ్మూ కశ్మీర్ అంశంపై చర్చలను మళ్లీ ప్రారంభించాలని కోరుతూ ఇరు దేశాలకు చెందిన 117 మంది ప్రముఖులు బుధవారం ఒక సంయుక్త బహిరంగ లేఖను విడుదల చేశారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లను ఉద్దేశించి ఈ లేఖను రాశారు. 'సెంటర్ ఫర్ పీస్ అండ్ ప్రోగ్రెస్' సంస్థ ఛైర్మన్ ఒ.పి. షా నేతృత్వంలో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. దక్షిణ ఆసియా ప్రాంతంలో శాశ్వత శాంతిని స్థాపించడానికి, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని, ద్వైపాక్షిక చర్చలను వెంటనే ప్రారంభించాలని ఈ లేఖలో ప్రముఖులు డిమాండ్ చేశారు.

**పాత చర్చల ఫ్రేమ్‌వర్క్‌ను పరిశీలించాలి**

ఇరు దేశాల మధ్య పెండింగ్‌లో ఉన్న అన్ని వివాదాస్పద సమస్యలపై సమగ్ర ద్వైపాక్షిక చర్చలను పునఃప్రారంభించాలని లేఖలో కోరారు. ముఖ్యంగా 2004 నుండి 2007 మధ్య కాలంలో జమ్మూ కశ్మీర్ అంశంపై జరిగిన చర్చల ఫ్రేమ్‌వర్క్‌ను మరోసారి పరిశీలించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రాంతీయ స్థిరత్వం కోసం ఇరు దేశాల చట్టబద్ధమైన భద్రతా ఆందోళనలను పరస్పరం గౌరవించుకుంటూ పరిష్కరించుకోవాలని సూచించారు. దక్షిణ ఆసియాలో శాంతి, సాధారణ పరిస్థితులు, సహకారాన్ని పునరుద్ధరించడానికి ఇరు దేశాల ప్రభుత్వాలు అర్థవంతమైన, నిరంతర చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విభేదాలను పరిష్కరించుకోవడానికి, స్థిరమైన, సంపన్నమైన ప్రాంతాన్ని నిర్మించడానికి నిరంతర చర్చలు మాత్రమే ఏకైక మార్గమని తాము బలంగా నమ్ముతున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

**సరిహద్దులు తెరిచి సంబంధాలు పెంచాలి**

ఇరు దేశాల మధ్య పూర్తి స్థాయి దౌత్య సంబంధాలను పునరుద్ధరించాలని, సాధారణ వీసా సేవలను మళ్లీ అందుబాటులోకి తీసుకురావాలని ఈ లేఖ ద్వారా ఒత్తిడి తెచ్చారు. కుటుంబాలు, విద్యార్థులు, విలేకరులు, కళాకారులు, వ్యాపారవేత్తలు, పౌర సమాజ గ్రూపుల మధ్య పరస్పర మార్పిడిని ప్రోత్సహించాలని కోరారు. వాణిజ్యం, ప్రయాణాల కోసం అటారీవాఘా భూ సరిహద్దును తిరిగి తెరవాలని, శ్రీనగర్‌ముజఫరాబాద్, ఢిల్లీలాహోర్ బస్సు సర్వీసులను పునఃప్రారంభించాలని సూచించారు. లడఖ్‌లోని కార్గిల్, గిల్గిట్ బాల్టిస్తాన్‌లోని స్కర్దూ మార్గాలను తెరవడంతో పాటు వాణిజ్య విమానాల కోసం వైమానిక మార్గాలను అందుబాటులోకి తేవడం వల్ల ప్రయాణ సమయం, ఖర్చులు తగ్గుతాయని వివరించారు. ఈ అభ్యర్థన ఏ రాజకీయ పక్షానికి మద్దతు కాదని, దాదాపు 200 కోట్ల మంది ప్రజల భవిష్యత్తు కోసం చేస్తున్న ప్రయత్నమని స్పష్టం చేశారు.



**కశ్మీర్ నేతల మద్దతు - బీజేపీ అభ్యంతరం**

ఈ లేఖపై సంతకం చేసిన కశ్మీర్ ప్రధాన మత గురువు మీర్వాయిజ్ ఉమర్ ఫారూఖ్ స్పందిస్తూ, కశ్మీర్ ప్రజలు దశాబ్దాలుగా ఎంతో నష్టపోయారని, వారు గౌరవప్రదమైన పరిష్కారాన్ని కోరుకుంటున్నారని అన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ నేత తన్వీర్ సాదిక్ కూడా చర్చల ప్రక్రియను స్వాగతించారు. అయితే, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ తరుణ్ చుగ్ ఈ లేఖను తీవ్రంగా ఖండించారు. ఇది ఇస్లామాబాద్ ఎజెండాను సమర్థించేలా ఉందని, భారతదేశ జాతీయ ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉందని విమర్శించారు. దశాబ్దాలుగా పాకిస్తాన్ స్పాన్సర్ చేస్తున్న ఉగ్రవాదం కారణంగా వేలాది మంది భారతీయులు, భద్రతా దళాలు ప్రాణాలు కోల్పోయారని, ఉగ్రవాదం, చర్చలు కలిసి సాగవని ఆయన స్పష్టం చేశారు. ఈ లేఖపై ఫరూక్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ, మణిశంకర్ అయ్యర్, రా మాజీ చీఫ్ ఎ.ఎస్. దులాత్ వంటి భారతీయ ప్రముఖులతో పాటు పాక్ మాజీ విదేశాంగ మంత్రి ఖుర్షీద్ మహ్మద్ కసూరి కూడా సంతకాలు చేశారు.

# ఈవీ విప్లవానికి ఏపీ వేగం

- ఎలక్ట్రిక్ వాహనాలపై దృష్టి
- హీరో విస్తరణకు శ్రీకారం

భవిష్యత్ పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాలదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా సత్యవేడులోని మాదన్నపాలెంలో హీరో మోటార్స్ గ్లోబల్ పార్ట్స్ సెంటర్ 2.0కు ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పవన్ ముంజాల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హీరో మోటార్స్ సంస్థ ఎలక్ట్రిక్ వాహనాల తయారీపై మరింత దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని హామీ ఇచ్చారు.

**రూ.3,200 కోట్ల విస్తరణ**

హీరో మోటార్స్ ప్లాంట్ విస్తరణను రూ.3,200 కోట్ల పెట్టుబడులతో వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కోరారు. విడా బ్రాండ్ పేరుతో ఎలక్ట్రిక్ టూ వీలర్ల ఉత్పత్తి జరగడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగానికి పెద్దపీట వేస్తున్నామని, 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఇప్పటికే 100 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ఒప్పందాలు పూర్తయ్యాయని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన రోడ్లు, రైలు, పోర్టు, విమాన అనుసంధానం ఏపీలో అందుబాటులో ఉందన్నారు.

**పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యం**

రాష్ట్రంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. విశాఖలో డేటా సెంటర్లు, అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్, కడపలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ వంటి భారీ ప్రాజెక్టులతో ఏపీ పారిశ్రామికంగా వేగంగా ఎదుగుతోందన్నారు. రైతులతో పాటు పరిశ్రమలకు అవసరమైన నీటి వనరులు కల్పించే కార్యాచరణ కొనసాగుతోందని చెప్పారు. సంపద సృష్టితో పాటు పేదలకు ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు.

**స్కాలర్‌షిప్‌ల ఆవిష్కరణ**

స్వర్ణాంధ్ర ఫౌండేషన్ భాగస్వామ్యంతో హీరో



మోటార్స్ రూపొందించిన 'బ్రిజ్ మోహన్ లాల్ ముంజాల్ హీరోస్ ఆఫ్ టుమారో' స్కాలర్‌షిప్‌లను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం హీరో మోటార్స్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించి ఉద్యోగులు, మహిళా సిబ్బందితో మాట్లాడారు. ప్లాంట్‌లో తయారవుతున్న ఎలక్ట్రిక్ వాహనాలను పరిశీలించి వాటి ప్రత్యేకతలపై వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మరోసారి స్పష్టం చేశారు.

# మావిగన్ మంటలు





ఏపీ రాజకీయాల్లో రాజధాని అంశంపై మళ్లీ రచ్చ మొదలైంది. అధికారంలో ఉన్నంత కాలం మూడు రాజధానులకు మొగ్గు అంటూ అమరావతి అంశాన్ని పక్కనబెట్టిన వైసీపీ అధినేత జగన్ ఇప్పుడు మావిగన్ అంటూ కొత్త నినాదంతో ముందుకు వచ్చారు. ఈ రోజు ఒక అడుగు ముందుకేసి, వచ్చే ఎన్నికల్లో మావిగన్ అంశమే తమ అజెండా అంటూ క్లారిటీ ఇచ్చేశారు. కేవలం అమరావతి ప్రాంతంలోనే అభివృద్ధి చేయకుండా మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాలను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని జగన్ ప్రకటించారు. వైసీపీ అధినేత చేసిన ఈ ప్రకటనపై సీఎం చంద్రబాబు ఘాటుగా స్పందించారు. జగన్‌వి సైకో రాజకీయాలని.. రౌడీ మూకలతో రాజధాని అభివృద్ధిని అడ్డుకునే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అమరావతి నిర్మాణాన్ని చేసి తీరుతామని... చంద్రబాబు ప్రతిజ్ఞ చేశారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధంతో మరోసారి అమరావతి వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. అటు ప్రతిపక్షం, ఇటు అధికార పక్షం సవాళ్లతో అమరావతి రైతులు అయోమయంలో పడుతున్నారు.

## ఎన్నికల అజెండా మావిగన్ | 2029 | ఎన్నికలకు సమరశంఖం!

- అమరావతి అవినీతిపై జగన్ ధ్వజం
- సమర శంఖం పూరించిన జగన్

2029 ఎన్నికల సమరానికి వైసీపీ అధినేత జగన్ శంఖారావం పూరించారు. మావిగన్ నమూనాను తమ ప్రధాన అజెండాగా ప్రకటించారు. అమరావతి ప్రాజెక్టు కేవలం అవినీతికి కేంద్రంగా మారిందని, ప్రజాధనం కాంట్రాక్టర్ల పాలవుతోందని దుయ్యబట్టారు. మంగళగిరివిజయవాడ గుంటూరు... మావిగన్ ప్రతిపాదన 2029 శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ ప్రధాన ఎన్నికల అజెండాగా ఉంటుందని ప్రకటించారు. ఈ ప్రతిపాదనను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లి వారి మద్దతు కోరతామని మాజీ ముఖ్యమంత్రి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మావిగన్ ఒక ప్రత్యామ్నాయ నమూనాగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. అధికార కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ అమరావతి రాజధాని ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, అసమ్మతి గళాలపై తప్పుడు కేసులు బనాయిస్తూ జంగిల్ రాజ్ నడుపుతున్నారని జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కస్టోడియల్ డెత్ కేసులు, ఓట్ల తొలగింపు ప్రక్రియ, రైతు సంక్షేమ పథకాల నిర్వీర్యం వంటి

(వివరాలు 5లో..)

- వైసీపీకి చంద్రబాబు గొడ్డలి పోటు
- అలిపిరి నుంచి అసెంబ్లీ అవమానం దాకా
- ప్రతిపక్షంపై తీవ్ర పదజాలం
- విరుచుకుపడిన టీడీపీ అధినేత

టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు... ఐదు రోజుల పర్యటనలో తొలిరోజు నెల్లూరు జిల్లాలో సాగిన ప్రసంగం తీరు రాజకీయ విశ్లేషకులను సైతం ఉక్కిరిబిక్కిరి చేసిందనుకోవచ్చు. నెల్లూరు జిల్లా పున్నపువారిపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రసంగం అంతకు మించి పదునైన రాజకీయ సంకేతాలనే ఇచ్చింది. పేదల సేవలో ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా మాట్లాడినప్పటికీ, ఆయన ప్రసంగం మొత్తం 2029 ఎన్నికల రాజకీయ సమీకరణాల చుట్టూనే తిరిగింది. జగన్ రెడ్డి టార్గెట్‌గా జనాలను తాకింది. వైసీపీని ఇకపై "గొడ్డలి పార్టీ"గా ప్రజలు కూడా పిలవాలని పిలుపునివ్వడం నుంచి రాజధాని అంశం, సోషల్ మీడియా రాజకీయాలు, మహిళల గౌరవం, పవన్ కళ్యాణ్‌పై వ్యాఖ్యలు, తన అరెస్టు, తన కుటుంబంపై జరిగిన విమర్శలు, గత ప్రభుత్వ పాలన వరకు అనేక అంశాలను ఒకే ప్రసంగంలో ప్రస్తావిస్తూ చంద్రబాబు తీవ్రస్థాయిలో

(వివరాలు 5లో..)

## చట్టాలకు చెల్లుచీటీ

- కూకటివేళ్లతో కదిలిన వ్యవస్థ
- పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం
- ప్రశ్నిస్తే గొంతు నొక్కేస్తున్నారన్న జగన్

ఆంధ్రప్రదేశ్‌లో చట్టవ్యవస్థ పూర్తిగా దిగజారిపోయిందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. గతంలో రాష్ట్ర అభివృద్ధిపై చర్చ జరిగేదని, ఇప్పుడు మాత్రం రెడ్‌బుక్ రాజ్యాంగం, పోలీస్ స్టేషన్లలో జరుగుతున్న లాకప్ మరణాలపై చర్చ జరుగుతోందని విమర్శించారు. రాష్ట్రంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. (వివరాలు 5లో..)

## నేరగాళ్ల నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం

- సాయికృష్ణ ఘటనపై తక్షణ చర్యలు
- స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు

విజయవాడలో యువకుడి అదృశ్యం ఘటన తన దృష్టికి రాగానే సీఐను సస్పెండ్ చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ కేసులో బాధ్యులైన వారిపై కఠిన చర్యలకు ఆదేశించామన్నారు. కానీ వైసీపీ నాయకులు ఈ దురదృష్టకర సంఘటనను వాడుకుంటూ కులాల మధ్య వివాదాన్ని సృష్టించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. (వివరాలు 5లో..)



## అతి చేస్తే చెప్పుతో కొడతా..!

- వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి
- ఎమ్మెల్యే ఆది ఘాటు హెచ్చరికలు

జిల్లా రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం తీవ్రరూపం దాల్చింది. జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిని ఉద్దేశించి ఆయన మండిపడ్డారు. రాజకీయ వ్యూహాల్లో భాగంగా ఈ ఇద్దరు నేతల మధ్య ఎప్పటి నుంచో విభేదాలు ఉన్నాయి. తాజా వ్యాఖ్యలు జిల్లా రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించాయి. నియోజకవర్గంలో పట్టు కోసం సాగుతున్న ఈ పోరు ఇప్పుడు బహిరంగ విమర్శల స్థాయికి చేరింది. (వివరాలు 7లో..)



## ప్రాణహాని భయం

- సాక్ష్యాల ధ్వంసం కలకలం
- సీఐ నాగరాజు సంచలన ఆరోపణలు

విజయవాడ రౌడీషీటర్ గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు దర్యాప్తు రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది. ఒకవైపు సస్పెండైన సీఐ నాగరాజు కోర్టు ఎదుట చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారగా, మరోవైపు సిట్ దర్యాప్తులో వెలుగులోకి వస్తున్న అంశాలు కేసును మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి. పోలీసు అధికారుల పాత్రపై అనుమానాలు పెరుగుతుండగా, సాక్ష్యాల ధ్వంసం, మృతదేహం ఆచూకీ లేకపోవడం వంటి పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. (వివరాలు 5లో..)

# ఏపీ విద్యా సంస్కరణలకు జాతీయ గుర్తింపు

**లోకేశ్ మార్పులపై రాష్ట్రపతి ప్రశంసల జల్లు**



ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేకంగా అభినందించారు. విద్యాశాఖ మంత్రిగా దేశానికే ఆదర్శంగా నిలిచేలా 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' కోసం ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. రాష్ట్రంలో విజయవంతంగా అమలువుతున్న విద్యా సంస్కరణలను ప్రశంసిస్తూ, ఇటువంటి మంచి మార్పులను భవిష్యత్తులోనూ ఇలాగే కొనసాగించాలని ఆమె సూచించారు.



## ప్రతిభా వంతులకు గౌరవం

**టాపర్లకు ఇళ్ల పట్టాల పంపిణీ**

విద్య ద్వారానే సమాజంలో గొప్ప మార్పు సాధ్యమని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ముగ్గురు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక బహుమతి లభించింది. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ముందస్తు హామీ మేరకు ఈ విద్యార్థులకు రెండు సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు మంజూరు చేశారు. (వివరాలు 7లో..)

# ప్రజా సేవలో పవర్‌హౌస్‌గా పంచాయతీరాజ్

» గ్రామ స్వరాజ్యానికి కూటమి సర్కార్ పెద్దపీట

» పంచాయతీల ఖాతాల్లోకి నేరుగా నిధులు



పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రజల సమస్యలు పరిష్కరించే పవర్‌హౌస్‌గా మారాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. గత ప్రభుత్వంలో నిధుల మళ్లింపు, గ్రామ సభల నిర్లక్ష్యంతో పంచాయతీలు బలహీనపడ్డాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేసే దిశగా పనిచేస్తోందని, గత రెండేళ్లలో రూ.4,200 కోట్లను నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు.

**ఉద్యోగులకు భరోసా**

ప్రభుత్వ అదనపు కార్యదర్శి కఠారి వెంకటకృష్ణ పదవీ విరమణ కార్యక్రమంలో మాట్లాడిన పవన్ కళ్యాణ్, నిజాయితీ గల అధికారుల సేవలు ప్రభుత్వానికి ఎంతో అవసరమన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, శాఖాపరమైన విచారణలను వేగవంతం చేసి నిర్దోషులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

**పారదర్శక పాలనకు ప్రాధాన్యం**

బదిలీలు, పదోన్నతుల్లో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని పవన్ కళ్యాణ్ తెలిపారు. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖలో 10 వేలకుపైగా పదోన్నతులు కల్పించామని చెప్పారు. స్థానిక సమస్యలు గ్రామ స్థాయిలోనే పరిష్కారమవ్వాలని, చిన్న సమస్యల కోసం ప్రజలు రాష్ట్ర స్థాయి నాయకులను ఆశ్రయించే పరిస్థితి ఉండకూడదన్నారు. ప్రభుత్వ భూములు, చెరువులను కాపాడుతూ గ్రామీణ పాలనను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు.

## పచ్చదనమే శాశ్వత అభివృద్ధి

**ప్రకృతితో కూడిన అభివృద్ధికి ప్రాధాన్యం**

**కాంక్రీట్ జంగిల్ మధ్య 'గ్రీన్ లంగ్స్'**

**రూ. 36 కోట్ల వ్యయంతో 18 నగర వనాలు**

**ప్రారంభించిన పవన్**

ప్రకృతితో కలిసి సాధించే అభివృద్ధే శాశ్వతమని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. రాష్ట్రంలో కొత్తగా అభివృద్ధి చేసిన 18 నగర వనాలు, ఎకో పార్కులు, కమ్యూనిటీ ఆధారిత ఎకో టూరిజం ప్రాజెక్టులను మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. మన వారసత్వం ప్రకృతిని కాపాడడంలోనే ఉండాలని ఆయన పేర్కొన్నారు. (వివరాలు 6లో..)




## జనాభా మార్పులపై కేంద్రం ఫోకస్

**ప్రత్యేక కమిటీ కసరత్తు • రాష్ట్రాలకు ప్రశ్నావళి పంపిణీ**



## నేరచరిత మంత్రులకు సంకటం

**ముప్పై రోజుల కస్టడీ చట్టానికి ఆమోదం**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై పార్లమెంటరీ ఉమ్మడి కమిటీ (జేపీసీ) కీలక నిర్ణయం తీసుకోనుంది. తీవ్రమైన నేరారోపణలపై అరెస్ట్ అయ్యి, వరుసగా 30 రోజుల పాటు కస్టడీలో ఉండే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు లేదా ఇతర మంత్రులను వారి పదవుల నుండి వెంటనే తొలగించాలనే ప్రతిపాదనను జేపీసీ యథాతథంగా ఉంచే అవకాశం ఉంది. (వివరాలు 7లో..)




## ఉద్యోగాల ఉచ్చు

- మయన్మార్ సైబర్ మాఫియా కిరాతకం
- బంధీలుగా 400 మంది భారతీయులు
- థాయిలాండ్ ఉద్యోగం ఆశ చూపి మోసం

# ఎన్నికల అజెండా మావిగన్

- అమరావతి అవినీతిపై జగన్ ధ్వజం
- సమర శంఖం పూరించిన జగన్

2029 ఎన్నికల సమరానికి వైసీపీ అధినేత జగన్ శంఖారావం పూరించారు. మావిగన్ నమూనాను తమ ప్రధాన అజెండాగా ప్రకటించారు. అమరావతి ప్రాజెక్టు కేవలం అవినీతికి కేంద్రంగా మారిందని, ప్రజాధనం కాంట్రాక్టర్ల పాలవుతోందని దుయ్యబట్టారు. మంగళగిరివిజయవాడగుంటూరు... మావిగన్ ప్రతిపాదన 2029 శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ ప్రధాన ఎన్నికల అజెండాగా ఉంటుందని ప్రకటించారు. ఈ ప్రతిపాదనను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లి వారి మద్దతు కోరతామని మాజీ ముఖ్యమంత్రి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మావిగన్ ఒక ప్రత్యామ్నాయ నమూనాగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. అధికార కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ అమరావతి రాజధాని ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, అసమ్మతి గళాలపై తప్పుడు కేసులు బనాయిస్తూ జంగిల్ రాజ్ నడుపుతున్నారని జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కస్టోడియల్ డెత్ కేసులు, ఓట్ల తొలగింపు ప్రక్రియ, రైతు సంక్షేమ పథకాల నిర్వీర్యం వంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై పదునైన విమర్శలు గుప్పించారు. ప్రజల పక్షాన నిలబడి ఈ ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

### మావిగన్ ప్రత్యామ్నాయ నమూనా

అమరావతితో పోలిస్తే మావిగన్ ఆచరణాత్మకమైన, ఆర్థికంగా లాభదాయకమైన ప్రత్యామ్నాయమని జగన్ మోహన్ రెడ్డి వాదించారు. ప్రస్తుతం రాజధాని ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు మితిమీరిన చెల్లింపులు చేయడానికి, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడానికి ఒక సాధనంగా మారిందని మండిపడ్డారు. మావిగన్ ప్రాంతానికి సహజమైన ప్రయోజనాలు, మౌలిక సదుపాయాలు ఉన్నాయని చెప్పారు. దీనివల్ల అభివృద్ధి ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని వివరించారు. ఈ ప్రణాళికతోనే రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలోకి వెళ్తామని ధీమా వ్యక్తం చేశారు.

### దళిత క్రైస్తవుల రిజర్వేషన్లపై నిలదీత

జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్ ముందు దళిత క్రైస్తవుల రిజర్వేషన్లపై తెలుగుదేశం పార్టీ తన వైఖరిని స్పష్టం చేయాలని జగన్ డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం గతంలో ఈ డిమాండ్‌కు మద్దతు ఇస్తూ అసెంబ్లీలో తీర్మానం ఆమోదించిందని గుర్తు చేశారు. ఓటర్లను విభజించడానికి టిడిపి ప్రయత్నిస్తోందని, ఈ విషయంలో మాత్రం మౌనంగా ఉంటోందని ఆరోపించారు. ఎస్సీ రిజర్వేషన్ల అంశంపై కూటమి ప్రభుత్వం దోబూచులాట ఆపాలని హితవు పలికారు.

### ఆంధ్రప్రదేశ్‌లో జంగిల్ రాజ్ పాలన

"హే రామ్... సేవ్ ఆంధ్ర" అనే నినాదాన్ని జగన్ మోహన్ రెడ్డి ఈ సందర్భంగా లేవనెత్తారు. రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి ప్రభుత్వం పోలీసు వ్యవస్థను వాడుకుంటోందని ఆరోపించారు. ఉండవల్లిలో నిరసన తెలుపుతున్న రైతులను కలవడానికి వెళ్లిన వైసీపీ నాయకులపై దాడులు జరిగాయని చెప్పారు. పోలీసులు బాధితులపైనే తప్పుడు కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అసమ్మతిని అణచివేయడానికి తప్పుడు క్రిమినల్ కేసులు బనాయిస్తున్నారని, రాష్ట్రంలో ప్రస్తుతం "జంగిల్ రాజ్" నడుస్తోందని విమర్శించారు. గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు, దళిత యువకుడు క్రాంతి కుమార్ మరణంపై జరుగుతున్న దర్యాప్తులను జగన్ ప్రశ్నించారు. ఈ రెండు కేసులను బలహీనపరిచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణను వాడుకుంటూ వైసిపి మద్దతుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుండి ఎంపిక చేసి తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కూటమి ప్రభుత్వం ఖూనీ చేస్తోందని మండిపడ్డారు.

### లిక్కర్ మాఫియాపై తీవ్ర విమర్శలు

తమ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాలు, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి రైతు సంక్షేమ చర్యలను ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వైసిపి అధినేత ఆరోపించారు. ధరలు తగ్గడం, ప్రభుత్వ మద్దతు లేకపోవడం వల్ల పొగాకు, మామిడి, ఇతర రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్లే అన్నదాతలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కొత్త ఎక్సైజ్ విధానాన్ని, లిక్కర్ మాఫియా విస్తరణను జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. రాష్ట్రంలో ప్రతిపాదిత బీచ్ షాక్ విధానాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. మద్యం అమ్మకాలను పెంచి ఆదాయం చూసుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. దీనివల్ల సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని హెచ్చరించారు. ప్రజావ్యతిరేక విధానాలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.




# మావిగన్ మంటలు

ఏపీ రాజకీయాల్లో రాజధాని అంశంపై మళ్లీ రచ్చ మొదలైంది. అధికారంలో ఉన్నంత కాలం మూడు రాజధానులకు మొగ్గు అంటూ అమరావతి అంశాన్ని పక్కనబెట్టిన వైసీపీ అధినేత జగన్ ఇప్పుడు మావిగన్ అంటూ కొత్త నినాదంతో ముందుకు వచ్చారు. ఈ రోజు ఒక అడుగు ముందుకేసి, వచ్చే ఎన్నికల్లో మావిగన్ అంశమే తమ అజెండా అంటూ క్లారిటీ ఇచ్చేశారు. కేవలం అమరావతి ప్రాంతంలోనే అభివృద్ధి చేయకుండా మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాలను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని జగన్ ప్రకటించారు. వైసీపీ అధినేత చేసిన ఈ ప్రకటనపై సీఎం చంద్రబాబు ఘాటుగా స్పందించారు. జగన్‌వి సైకో రాజకీయాలని.. రౌడీ మూకలతో రాజధాని అభివృద్ధిని అడ్డుకునే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అమరావతి నిర్మాణాన్ని చేసి తీరుతామని... చంద్రబాబు ప్రతిజ్ఞ చేశారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధంతో మరోసారి అమరావతి వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. అటు ప్రతిపక్షం, ఇటు అధికార పక్షం సవాళ్లతో అమరావతి రైతులు అయోమయంలో పడుతున్నారు.

# 2029 ఎన్నికలకు సమరశంఖం

- వైసీపీకి చంద్రబాబు గొడ్డలి పోటు
- అలిపిరి నుంచి అసెంబ్లీ అవమానం దాకా
- ప్రతిపక్షంపై తీవ్ర పదజాలం
- విరుచుకుపడిన టీడీపీ అధినేత

టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు... ఐదు రోజుల పర్యటనలో తొలిరోజు నెల్లూరు జిల్లాలో సాగిన ప్రసంగం తీరు రాజకీయ విశ్లేషకులను సైతం ఉక్కిరిబిక్కిరి చేసిందనుకోవచ్చు. నెల్లూరు జిల్లా పున్నపువారిపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రసంగం అంతకు మించి పదునైన రాజకీయ సంకేతాలనే ఇచ్చింది. పేదల సేవలో ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా మాట్లాడినప్పటికీ, ఆయన ప్రసంగం మొత్తం 2029 ఎన్నికల రాజకీయ సమీకరణాల చుట్టూనే తిరిగింది. జగన్ రెడ్డి టార్గెట్ గా జనాలను తాకింది. వైసీపీని ఇకపై "గొడ్డలి పార్టీ"గా ప్రజలు కూడా పిలవాలని పిలుపునివ్వడం నుంచి రాజధాని అంశం, సోషల్ మీడియా రాజకీయాలు, మహిళల గౌరవం, పవన్ కళ్యాణ్‌పై వ్యాఖ్యలు, తన అరెస్టు, తన కుటుంబంపై జరిగిన విమర్శలు, గత ప్రభుత్వ పాలన వరకు అనేక అంశాలను ఒకే ప్రసంగంలో ప్రస్తావిస్తూ చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రసంగంలో అత్యంత చర్చనీయాంశంగా నిలిచింది వైసీపీకి "గొడ్డలి పార్టీ" అనే రాజకీయ ముద్ర వేయాలన్న చంద్రబాబు పిలుపు. రాష్ట్రంలో ఒక గొడ్డలి పార్టీ ఉందని, ప్రజలు కూడా ఇకపై అదే పేరుతో పిలవాలని ఆయన వ్యాఖ్యానించారు. ఇది కేవలం ప్రత్యర్థి పార్టీపై చేసిన విమర్శ మాత్రమే కాకుండా, రాజకీయంగా ఒక ప్రతికూల గుర్తింపును ప్రజల్లో బలంగా నాటే ప్రయత్నంగా కనిపించింది. ఎన్నికల రాజకీయాల్లో ప్రత్యర్థి పార్టీకి ఒక స్థిరమైన ప్రతికూల ఇమేజ్‌ను సృష్టించడం అనేది ఎన్నో సందర్భాల్లో ఫలితాలను ప్రభావితం చేసిన వ్యూహంగా చరిత్ర చెబుతోంది. అదే తరహాలో వైసీపీపై ప్రజల్లో ఒక అభిప్రాయాన్ని బలపరిచే ప్రయత్నం ఈ వ్యాఖ్యల ద్వారా కనిపించిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

### అమరావతిపై దండయాత్రను తిప్పికొడతాం

రాజధాని అంశాన్ని కూడా చంద్రబాబు మరోసారి ప్రధానంగా ప్రస్తావించారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని మూడు ముక్కలుగా చేయాలని గత ప్రభుత్వం ప్రయత్నించిందని ఆయన ఆరోపించారు. అమరావతి రైతులపై నిరంతరం దండయాత్ర చేశారని, వారి ఉద్యమాన్ని అణచివేయడానికి అధికార యంత్రాంగాన్ని ఉపయోగించారని విమర్శించారు. 2029 తర్వాత కూడా రాష్ట్ర రాజధాని ఏదన్న ప్రశ్న ప్రజల్లో నవ్వుల పాలయ్యే పరిస్థితిని గత ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. రాష్ట్రానికి ఒకే రాజధాని అవసరమని, కానీ వైసీపీకి మాత్రం రాజధానిపై స్పష్టమైన దృక్పథం లేదని విమర్శించారు. హోంమంత్రి అనితపై సోషల్ మీడియాలో జరుగుతున్న వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "మేకప్" అంటూ మహిళా నాయకురాలిని అవమానించే వ్యాఖ్యలు చేయడం రాజకీయ సంస్కృతి కాదన్నారు. రాజకీయ విమర్శలు చేయొచ్చు కానీ వ్యక్తిగత అవమానాలు, మహిళల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు ఏ పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. "నా ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు" అంటూ హెచ్చరిక జారీ చేస్తూ, మహిళలపై అసభ్య వ్యాఖ్యలను సహించబోమని స్పష్టం చేశారు.

### సోషల్ మీడియా అసభ్యతపై నిప్పులు

సోషల్ మీడియాను అసభ్యకర రాజకీయాల వేదికగా మార్చారని కూడా చంద్రబాబు ఆరోపించారు. కొందరు పోస్టులు పెట్టి శాడిస్టు ఆనందం పొందుతున్నారని, వాటిపై ప్రశ్నిస్తే "నా ఇష్టం" అంటూ సమాధానం చెబుతున్నారని మండిపడ్డారు. భావప్రకటన స్వేచ్ఛ పేరుతో వ్యక్తిత్వ హననాన్ని సమర్థించలేమని, ప్రజాస్వామ్యంలో రాజకీయ భేదాభిప్రాయాలు ఉండొచ్చుగానీ వ్యక్తిగత దూషణలు అంగీకారయోగ్యం కావని వ్యాఖ్యానించారు. సాయికృష్ణ కేసు సందర్భంగా పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశపూర్వకంగా వివాదంలోకి లాగారని చంద్రబాబు ఆరోపించారు. కుల రాజకీయాలను రెచ్చగొట్టాలనే ఉద్దేశంతోనే ఈ వ్యవహారం నడిపించారని అన్నారు. పవన్ కళ్యాణ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులపై కూడా అసభ్యకర పోస్టులు పెట్టించారని ఆరోపిస్తూ, ఇది కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదని, రాజకీయ విలువలపై జరిగిన దాడిగా అభివర్ణించారు. రాష్ట్రంలో బ్లేడ్ బ్యాచ్‌లు, రౌడీ మూకలకు వైసీపీ మద్దతు లభిస్తోందని కూడా చంద్రబాబు ఆరోపించారు. సైకో రాజకీయాలను సమర్థించే నాయకత్వం వల్లే అరాచక సంస్కృతి పెరిగిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో హింసకు, బెదిరింపులకు, వ్యక్తిగత కక్ష సాధింపులకు స్థానం ఉండకూడదని స్పష్టం చేశారు.

### నేను తలుచుకుంటే జైలుకు పంపడం నిమిషం

అలాగే తన అరెస్టును కూడా చంద్రబాబు ప్రస్తావించారు. జైలుకు పంపిన ఘటనపై తనకు వ్యక్తిగత కోపం లేదని పేర్కొంటూనే, తాను అనుకుంటే ఎదుటివారిని జైలుకు పంపడానికి నిమిషం కూడా పట్టదని సంచలన వ్యాఖ్యలు చేయడం ఈ సందర్భంగా గమనించదగ్గ విషయం. ఈ మాటలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికారంలో ఉన్నప్పటికీ ప్రతీకార రాజకీయాలకు తాను పాల్పడలేదనే సంకేతాన్ని ఇవ్వాలన్న ఉద్దేశంతోనే ఈ వ్యాఖ్యలు చేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యాభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని చంద్రబాబు చెప్పారు. అలిపిరి వద్ద 28 క్లైమోర్ మైన్స్ పేలిన ఘటనలో కూడా భయపడలేదని గుర్తుచేశారు. అయితే తన సతీమణి పేరును రాజకీయాల్లోకి లాగి అవమానించడం తనను తీవ్ర మానసిక వేదనకు గురి చేసిందని భావోద్వేగంగా చెప్పారు. అసెంబ్లీ సాక్షిగా తనను కన్నీళ్లు పెట్టించిన ఘటనను గుర్తు చేసుకుంటూ, ఆ అనుభవాన్ని జీవితంలో మరచిపోలేనిదిగా అభివర్ణించారు.

### 2029 ఎన్నికల సమరానికి శంఖారావం

గత ప్రభుత్వ పాలనను తీవ్రంగా విమర్శించిన చంద్రబాబు, అలాంటి పాలన మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా దెబ్బతింటుందని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వైకుంఠపాళి ఆటలా మారిపోతుందని వ్యాఖ్యానిస్తూ, ప్రజలు మరోసారి అలాంటి పరిస్థితికి అవకాశం ఇవ్వవద్దని కోరారు. ఏ ఎన్నిక వచ్చినా వైసీపీ నాయకులను తిరస్కరించాలని పిలుపునిచ్చారు. స్థానిక కార్యక్రమంలో మాట్లాడినప్పటికీ చంద్రబాబు ప్రసంగం మొత్తం 2029 ఎన్నికల ప్రచారానికి నాంది పలికినట్టుగానే కనిపించింది. స్థానిక సంస్థల ఎన్నికలను దాటి, రాబోయే సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కార్యకర్తలను సిద్ధం చేసే ప్రయత్నం ఈ ప్రసంగంలో స్పష్టంగా కనిపించింది. ప్రత్యర్థి పార్టీకి ఒక ప్రతికూల రాజకీయ గుర్తింపును ప్రజల్లో స్థిరపరచడం, అమరావతి, మహిళల గౌరవం, సోషల్ మీడియా దాడులు వంటి భావోద్వేగ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, అలాగే 2029 ఎన్నికలను ఇప్పటినుంచే లక్ష్యంగా పెట్టుకుని రాజకీయ ప్రచారానికి శ్రీకారం చుట్టడం వంటి వ్యూహాలు ఈ ప్రసంగంలో ప్రతిఫలించాయి.



# గురి తప్పని శశిధర్ ప్రతిభ

- రాష్ట్రస్థాయి షూటింగ్‌లో బంగారు పతకం
- యువ క్రీడాకారుడికి మంత్రి సత్కారం

ఆంధ్రప్రదేశ్ 26వ రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన కోపూరి శశిధర్ నాయుడు (26) అద్భుత విజయం సాధించాడు. ప్రోన్ పొజిషన్ ఓపెన్ సైట్ .22 - 50 మీటర్ల రైఫిల్ షూటింగ్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అతని ప్రతిభను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రివర్యులు శ్రీ మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రాష్ట్ర యువ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రభుత్వ పరంగా క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. కోపూరి శశిధర్ నాయుడు భవిష్యత్తులో మరెన్నో ప్రతిష్టాత్మక విజయాలు సాధించాలని మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రాణహాని భయం

- సాక్ష్యాల ధ్వంసం కలకలం
- సీఐ నాగరాజు సంచలన ఆరోపణలు

విజయవాడ రౌడీషీటర్ గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు దర్యాప్తు రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది. ఒకవైపు సస్పెండైన సీఐ నాగరాజు కోర్టు ఎదుట చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారగా, మరోవైపు సిట్ దర్యాప్తులో వెలుగులోకి వస్తున్న అంశాలు కేసును మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి. పోలీసు అధికారుల పాత్రపై అనుమానాలు పెరుగుతుండగా, సాక్ష్యాల ధ్వంసం, మృతదేహం ఆచూకీ లేకపోవడం వంటి పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.



### నాగరాజు ఆరోపణలు

సస్పెండైన సీఐ నాగరాజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయాధికారి ఎదుట హాజరై తనకు ప్రాణహాని ఉందని తెలిపారు. సాయికృష్ణ లాకప్ డెత్ కేసును ఒప్పుకునేలా తనపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ఈ కేసులో అకారణంగా తనను ఇరికించే ప్రయత్నం జరుగుతోందని కోర్టుకు వివరించారు. ఇప్పటికే సిట్ విచారణకు పూర్తిగా సహకరించానని, తన వద్ద ఉన్న సమాచారాన్ని అధికారులకు అందించానని చెప్పారు. తన ఆరోపణలను లిఖితపూర్వకంగా సమర్పించాలని న్యాయస్థానం నాగరాజును ఆదేశించింది.

### హెడ్ కానిస్టేబుళ్లపై సిట్ అనుమానాలు

ఈ కేసులో అరెస్టయిన హెడ్ కానిస్టేబుళ్లు అశోక్, నానిపై సిట్ అధికారులు కీలక అంశాలను రిమాండ్ రిపోర్టులో ప్రస్తావించారు. విచారణ సమయంలో దర్యాప్తు అధికారుల ప్రశ్నలకు ఇద్దరూ సరైన సమాధానాలు ఇవ్వకుండా మౌనంగా వ్యవహరించారని పేర్కొన్నారు. వారి మొబైల్ ఫోన్ల గురించి ప్రశ్నించగా నాగ్‌పూర్‌లో విక్రయించామని చెప్పినట్టు రిమాండ్ రిపోర్టులో నమోదు చేశారు. ఈ సమాధానాలపై సిట్ అనుమానాలు వ్యక్తం చేస్తూ మరింత లోతుగా విచారణ కొనసాగిస్తోంది.

### కానిస్టేబుళ్లకు రిమాండ్

కస్టోడియల్ డెత్ కేసులో అరెస్టయిన కానిస్టేబుళ్లు బాబురావు, సాంబయ్యలకు విజయవాడ రెండో ఏసీఎం కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు బాబురావును అవనిగడ్డ జైలుకు, సాంబయ్యను గన్నవరం జైలుకు తరలించారు. సిట్ అధికారులు వీరిద్దరినీ వరుసగా ఏ5, ఏ6 నిందితులుగా చేర్చి దర్యాప్తును వేగవంతం చేస్తున్నారు.

### సాక్ష్యాల ధ్వంసం ఆరోపణలు

సిట్ సమర్పించిన రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు బయటపడ్డాయి. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ హార్డ్ డిస్క్‌ను మార్చి కీలక సాక్ష్యాలను ధ్వంసం చేయడంలో బాబురావు, సాంబయ్య కీలక పాత్ర పోషించారని అధికారులు పేర్కొన్నారు. ఈ చర్యల వల్ల కేసు దర్యాప్తును దారి మళ్లించే ప్రయత్నం జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డిజిటల్ ఆధారాలను చెరిపివేయడం వెనుక మరికొందరి పాత్ర ఉందా అనే కోణంలో కూడా సిట్ విచారణ కొనసాగిస్తోంది.

# నేరగాళ్ల నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం

- సాయికృష్ణ ఘటనపై తక్షణ చర్యలు
- స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు

విజయవాడలో యువకుడి అదృశ్యం ఘటన తన దృష్టికి రాగానే సీఐను సస్పెండ్ చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ కేసులో బాధ్యులైన వారిపై కఠిన చర్యలకు ఆదేశించామన్నారు. కానీ వైసీపీ నాయకులు ఈ దురదృష్టకర సంఘటనను వాడుకుంటూ కులాల మధ్య వివాదాన్ని సృష్టించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రతిపక్ష పార్టీ వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని తేల్చి చెప్పారు.

### సోషల్ మీడియాలో అసభ్య ప్రచారాలు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులతో వైసీపీ విష ప్రచారం చేస్తోందని చంద్రబాబు ఆరోపించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లతో ఆ పార్టీ నేతలు రెచ్చిపోతున్నారని విమర్శించారు. హోం మంత్రి అనిత మేకప్‌పై ప్రతిపక్ష నేతలు అసహ్యంగా, అవమానకరంగా మాట్లాడారని గుర్తు చేశారు. మహిళా కమిషన్ ఈ అంశంపై గట్టిగా ప్రశ్నించినా ఆ పార్టీ నేతలు కనీసం తప్పు తెలుసుకోకుండా తమ వ్యాఖ్యల్ని సమర్థించుకోవడం దారుణమన్నారు. వైసీపీ అధినేత సహకారం లేకపోతే ఆ పార్టీ నేతలు ఇంత విచ్చలవిడిగా మాట్లాడే పరిస్థితి ఉండదన్నారు.

### ప్రతీకార రాజకీయాలకు మేము దూరం

నేరాలు చేసే పార్టీ, నేరస్తులను కాపాడే పార్టీని ఇప్పుడే చూస్తున్నామని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అర్హత లేని వారిని అందలం ఎక్కిస్తే రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు సమస్యలు వస్తాయన్నారు. ఇలాంటి వ్యక్తులను జైల్లో పెట్టాలంటే కూటమి ప్రభుత్వానికి ఒక్క నిమిషం పని అని, కానీ తాము ప్రతీకార రాజకీయాలు చేయటం లేదని స్పష్టం చేశారు. తమ దృష్టి అంతా రాష్ట్రం అభివృద్ధి కావాలని, తెలుగు వారిని ప్రపంచస్థాయిలో నిలబెట్టాలనేనని వివరించారు. రాష్ట్రంలో రౌడీయిజం చేయాలన్నదే వైసీపీ నేతల ఆలోచన అని విమర్శించారు.

### గంజాయి సంస్కృతిపై ఈగల్ టాస్క్‌ఫోర్స్

గత పాలకులు రాష్ట్రాన్ని గంజాయికి అడ్డాగా మార్చారని చంద్రబాబు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేకంగా 'ఈగల్ టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేసి ఈ అక్రమ సంస్కృతిని గట్టిగా నియంత్రించామని చెప్పారు. గత పాలకులు ప్రజల్ని బంధించి, భయపెట్టి మరీ సమావేశాలు పెట్టేవారని, ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చాకే ప్రజలకు పూర్తి స్వేచ్ఛ వచ్చిందని పేర్కొన్నారు. వైసీపీ రోజుకో ఫేక్ న్యూస్, రోజుకో విన్యాసంతో కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోందని హెచ్చరించారు.

### అమరావతి నిర్మాణంలో వేగం

రాష్ట్ర ప్రజలందరికీ అవసరమైన రాజధాని అమరావతి వైసీపీకి అవసరం లేదని, అందుకే ఇంకా రాజధానిపై కుట్రలను కొనసాగిస్తూనే ఉన్నారని ముఖ్యమంత్రి దుయ్యబట్టారు. ఇప్పుడు అమరావతిలో వేగంగా పనులు జరుగుతుంటే వారు సహించలేకపోతున్నారని చెప్పారు. గత పాలకుడు తీసుకున్న అస్తవ్యస్త నిర్ణయాలతో రాష్ట్రానికి రాజధానే లేకుండా పోయిందన్నారు. మూడు రాజధానుల పేరిట తీవ్ర గందరగోళం పరిచారని, దీనివల్ల పొరుగు రాష్ట్రాలకు వెళ్తే ఏపీ ప్రజలు హేళనకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటులో శాశ్వత రాజధాని చట్టం చేస్తుంటే విపక్షాలు కొత్త నాటకాలు మొదలు పెట్టాయని విమర్శించారు.

# చట్టాలకు చెల్లుచీటీ

- కూకటివేళ్లతో కదిలిన వ్యవస్థ
- పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం
- ప్రశ్నిస్తే గొంతు నొక్కేస్తున్నారన్న జగన్

ఆంధ్రప్రదేశ్‌లో చట్టవ్యవస్థ పూర్తిగా దిగజారిపోయిందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోపించారు. గతంలో రాష్ట్ర అభివృద్ధిపై చర్చ జరిగేదని, ఇప్పుడు మాత్రం రెడ్‌బుక్ రాజ్యాంగం, పోలీస్ స్టేషన్లలో జరుగుతున్న లాకప్ మరణాలపై చర్చ జరుగుతోందని విమర్శించారు. రాష్ట్రంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారి గొంతులు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని విభేదించే స్వరాలను అణచివేస్తున్నారని జగన్ ఆరోపించారు.

### సాయికృష్ణను హింసించి హత్య చేశారు

విజయవాడ సాయికృష్ణ కేసు, క్రాంతికుమార్ ఆత్మహత్య, కర్నూలు గంగమ్మ ఘటన వంటి సంఘటనలు రాష్ట్రంలో నెలకొన్న భయానక పరిస్థితులకు అద్దం పడుతున్నాయని జగన్ పేర్కొన్నారు. సాయికృష్ణ కేసును ప్రస్తావిస్తూ, కస్టడీలో ఒక వ్యక్తిని హింసించి హత్య చేసి, ఆపై ఆధారాలను మాయం చేశారని ఆరోపించారు. కనీసం అతని కుటుంబ సభ్యులకు అస్థికలు కూడా ఇవ్వకుండా దాచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమైన తర్వాతే ప్రభుత్వం తన వైఖరి మార్చుకుందని విమర్శించారు.

### బాధితులను రౌడీలుగా చిత్రీకరిస్తున్నారు

ప్రభుత్వం తొలుత బాధితుడిని రౌడీషీటర్‌గా చిత్రీకరించి, ఆ తర్వాతే నాటకీయంగా కుటుంబాన్ని పిలిచి న్యాయం చేస్తామని చెప్పడం విరుద్ధ వైఖరికి నిదర్శనమని జగన్ విమర్శించారు. రాష్ట్రంలో చట్టం, న్యాయం అమలు కావడం లేదని, బాధితులకు మద్దతు తెలిపిన వారిపైనా తప్పుడు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఇటువంటి ప్రజావ్యతిరేక చర్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

### కిందిస్థాయి సిబ్బందిపైనే వేటు

విజయవాడ సాయికృష్ణ కేసులో పోలీసు ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులను మాత్రమే బాధ్యులుగా చూపిస్తూ అసలు విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని జగన్ ఆరోపించారు. సాయికృష్ణ రిమాండ్ రిపోర్ట్‌ను పరిశీలిస్తే పై అధికారులను ఎలా కాపాడుతున్నారో స్పష్టంగా అర్థమవుతుందని ఆయన అన్నారు. సాయికృష్ణను మార్కాపురం నుంచి టాస్క్‌ఫోర్స్ పోలీసులు తీసుకువచ్చి కృష్ణలంక పోలీసులకు అప్పగించారని, దీనికి సంబంధించిన అక్నాలెడ్జ్‌మెంట్ కూడా ఉందని జగన్ పేర్కొన్నారు.

### వ్యవస్థల కూల్చివేతపై జగన్ ఆగ్రహం

సాయికృష్ణ తల్లి, బంధువులు సీపీ, డీజీపీకి ఫిర్యాదులు చేసినా స్పందించలేదని, రాష్ట్రంలో వ్యవస్థలు పూర్తిగా కుప్పకూలిపోయాయని జగన్ ఆరోపించారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ విషయంలోనూ అనేక సందేహాలు ఉన్నాయని అన్నారు. ఒక రిమాండ్ రిపోర్ట్‌లో నెల రోజుల ఫుటేజ్ లేదని, మరో రిపోర్ట్‌లో 18 నెలల ఫుటేజ్ అందుబాటులో లేదని పేర్కొనడం అనుమానాలకు తావిస్తోందన్నారు. క్లౌడ్ సర్వర్లలో డేటా అందుబాటులో ఉన్నప్పటికీ దానిని ఎందుకు సేకరించలేదని, కాల్ రికార్డులు ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నించారు.



యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వైటీడీఏ) నియామకాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఎంపీగా, ఎమ్మెల్సీగా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఎంతో సీనియారిటీ ఉన్న తనను ఈ విషయంలో కనీసం సంప్రదించకపోవడం చాలా బాధ కలిగించిందని ఆయన ఆవేదన చెందారు. జిల్లాకు చెందిన కీలక నాయకుడినైన తనకు సమాచారం కూడా ఇవ్వకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరైన పద్ధతి కాదని ఆయన స్పష్టం చేశారు. స్థానిక నాయకులను కాదని హైదరాబాద్‌లో కూర్చొని వన్ సైడ్ నిర్ణయాలు తీసుకోవడం తప్పు అని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. యాదాద్రి జిల్లాకు సంబంధించి ఎవరైనా అనుభవజ్ఞులైన వ్యక్తులను కమిటీ మెంబర్లుగా పెడితే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. అలా కాకుండా మునుగోడు నియోజకవర్గం నుంచి ఎవరికో మెంబర్ పదవి ఇచ్చారని, ఆ సమాచారం కూడా తనకు లేదని చెప్పారు. ప్రస్తుత నాయకత్వ వ్యవహారశైలి తనకు అస్సలు నచ్చడం లేదని ఆయన బహిరంగంగానే తప్పుబట్టారు.

# ఆత్మాభిమానానికి ఆరాటం.. రాజన్న.. ధర్మ పోరాటం



## యాదాద్రి టెంపుల్ బోర్డ్ నియామకంపై కోమటిరెడ్డి అసంతృప్తి

యాదగిరిగుట్ట దేవస్థాన ధర్మకర్తల మండలి నియామకం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. ఎవరికీ ముందస్తు సమాచారం లేకుండానే ఈ నిర్ణయాలు తీసుకున్నారనే టాక్ వినిపిస్తోంది. బోర్డులో ఇద్దరు ఫార్మా కంపెనీల యజమానులు, చిరంజీవి భార్య సురేఖకు చోటు కల్పించారు. తెలంగాణ సమాజానికి ఎంతో పవిత్రమైన, సెంటిమెంట్‌తో కూడిన ఈ ఆలయ కమిటీలో స్థానికులకు తగిన గుర్తింపు లభించలేదనే భావన వ్యక్తమవుతోంది. యాదాద్రి అంటే తెలంగాణ తిరుపతిగా భావించే భక్తుల నమ్మకాలకు, ఈ నియామకాలకు ఎక్కడా పొంతన కుదరడం లేదు. ప్రాంతీయ ప్రాతినిధ్యం లోపించడంతో ఈ ప్రక్రియ అంతా తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఈ మొత్తం వ్యవహారంపై మునుగోడు ఎమ్మెల్యే, సీనియర్ కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో మునుగోడు నియోజకవర్గం 50 శాతం విస్తరించి ఉందని... అంతటి ప్రాధాన్యం ఉన్న ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తనకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదని ఆయన వాపోయారు. గతంలో ఎంపీగా, ఎమ్మెల్సీగా సేవలు అందించిన అనుభవం ఉన్నప్పటికీ, కనీసం ఒక్క సభ్యుడి పేరును కూడా సూచించే అవకాశం ఇవ్వకపోవడం ఎంటని మండిపడ్డారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారికి కనీస ఇంగిత జ్ఞానం లేకపోవడం వల్లే ఇలాంటి వన్ సైడ్ నిర్ణయాలు జరుగుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు.

### హస్తం పార్టీలో కొత్త బ్యాచ్ హవా

పార్టీ ప్రస్తుత నడవడిక, సీనియర్లను గౌరవించే విధానం అస్సలు నచ్చడం లేదని రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే అంగీకరించారు. ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ కోసం మొదటి నుంచి పోరాడిన వారు రోజురోజుకూ కనుమరుగైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడెక్కడో ఉన్న కొత్త బ్యాచ్ అంతా వచ్చి ఇప్పుడు పార్టీని, నిర్ణయాలను శాసిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం అనేది పెద్ద కలలు కనాలి, చిన్నగా మొదలై పెద్ద విజయాలు సాధించాలి, ప్రజల కోసం రాత్రి పగలు కష్టపడాలి. అంతేకానీ, ఊరికే హంగామా చేయడం, పెద్ద షో ఆఫ్ చేయడం, ఎక్కువ మాట్లాడటం ప్రజలకు నచ్చదని హితవు పలికారు. తక్కువ మాట్లాడి, ఎక్కువ పని చేయడమే ప్రభుత్వానికి అందం. చండూరు, చౌటుప్పల్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకున్న చరిత్ర తమకు ఉందన్నారు. ఇంతటి నిబద్ధతతో పనిచేస్తున్న తమ లాంటి సీనియర్లను సంప్రదించకుండా నిర్ణయాలు తీసుకోవడం పార్టీ పద్ధతులకు విరుద్ధమని ఆక్షేపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో సాగుతున్న వ్యవహార శైలి, సీనియర్లను పక్కనపెట్టే పద్ధతులు అస్సలు నచ్చడం లేదని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

### అధిష్టానానికి ఫిర్యాదు చేస్తా

ఈ మొత్తం వ్యవహారాన్ని తాను డెఫినెట్‌గా ఏఐసీసీ ప్రెసిడెంట్, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్తానని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. మొన్న జరిగిన పార్టీ ముఖ్యమైన మీటింగ్‌కు కూడా తాను అందుకే వెళ్లలేదని వివరించారు. ఇక్కడి నాయకుల బిహేవియర్, పద్ధతి ఏమాత్రం బాగోలేదని, ఈ వ్యవహారశైలి నచ్చకనే తాను పార్టీ కార్యక్రమాలకు కొంత దూరంగా ఉంటున్నానని చెప్పారు. అయితే తాను ఎక్కడికీ పోవడం లేదని, నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజల్లోనే ఉంటున్నానని స్పష్టం చేశారు. ఇటీవలే తాను ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిసి ఇక్కడి పరిస్థితిని వివరించానని రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు. ఇక్కడ పరిస్థితులు బాలేవని, ఇలాంటి నిర్ణయాల వల్ల పార్టీకి మంచిది కాదని తాను అధినాయకత్వానికి చెప్పినట్లు తెలిపారు. పార్టీకి సంబంధించిన ఏ వ్యవహారంలోనైనా అందరినీ కలుపుకుపోయే విధంగా ఉండాలని తాను ప్రభుత్వానికి, ప్రభుత్వంలోని పెద్దలకు, ముఖ్యమంత్రికి సూచిస్తున్నానని చెప్పారు. ఇటువంటి కోఆర్డినేషన్ లేకపోతే భవిష్యత్తులో పార్టీకి పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

### దానకర్ణుడిపై అన్న ప్రశంసలు

ఇటీవల అన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలపై వస్తున్న ట్రోలింగ్‌ను రాజగోపాల్ రెడ్డి తిప్పికొట్టారు. వెంకటరెడ్డి తనను 'దానకర్ణుడు' అని సంబోధించడం వెనుక ఎలాంటి వెటకారం లేదని, అది పూర్తిగా మంచి ఉద్దేశంతో అన్న మాటలని స్పష్టం చేశారు. పేద ప్రజలు తన వద్దకు వస్తే పరిమితులకు లోబడకుండా సహాయం చేసే గుణం తనకు ఉందన్నారు. ఎన్నో కుటుంబాలు అత్యంత ఘోరమైన పరిస్థితుల్లో ఉన్నప్పుడు, హాస్పిటల్ బిల్లులు 10 నుండి 12 లక్షల రూపాయల వరకు ఉన్నా, సొంత డబ్బులు కట్టి ఎందరి ప్రాణాలో కాపాడిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఆ నమ్మకంతోనే, కష్టం వస్తే రాజగోపాల్ రెడ్డి ఆదుకుంటాడనే భావనతోనే అన్న అలా మాట్లాడారని వివరణ ఇచ్చారు.

# పచ్చదనమే శాశ్వత అభివృద్ధి

- ప్రకృతితో కూడిన అభివృద్ధే శాశ్వతం
- కాంక్రీట్ జంగిల్ మధ్య 'గ్రీన్ లంగ్స్'
- రూ. 36 కోట్ల వ్యయంతో 18 నగర వనాలు
- నగర వనాలకు ప్రారంభించిన పవన్



ప్రకృతితో కలిసి సాధించే అభివృద్ధే శాశ్వతమని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. రాష్ట్రంలో కొత్తగా అభివృద్ధి చేసిన 18 నగర వనాలు, ఎకో పార్కులు, కమ్యూనిటీ ఆధారిత ఎకో టూరిజం ప్రాజెక్టులను మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. మన వారసత్వం ప్రకృతిని కాపాడడంలోనే ఉండాలని ఆయన పేర్కొన్నారు.

### రూ.36 కోట్లతో అభివృద్ధి

రూ.36 కోట్ల వ్యయంతో నగర వనాలను అభివృద్ధి చేసినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. పట్టణాల్లో పర్యావరణ సమతుల్యతను కాపాడే గ్రీన్ లంగ్స్‌గా ఇవి పనిచేస్తాయని చెప్పారు. కొడూరు, కైలాసగిరి, మదనపల్లెలలో ఎర్రచందనం పరిరక్షణ పార్కులు కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

### ప్రజలకు ప్రకృతి అనుభూతి

నగర వనాల్లో పక్షుల ఆవాసాలు, బోటింగ్, ట్రెకింగ్, యోగా కేంద్రాలు, ఓపెన్ జిమ్‌లు వంటి సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఇవి ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదాన్ని అందించడంతో పాటు భవిష్యత్ తరాలకు పచ్చని వారసత్వంగా నిలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నగర వనాలను ఆధ్యాత్మిక, సాహస పర్యాటక కేంద్రాలుగా కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టించిన ఉస్మానియా వైద్యులు




- ఒకే రోగికి 5 అవయవాల మార్పిడి శస్త్రచికిత్స
- దేశ వైద్య చరిత్రలో సరికొత్త అధ్యాయం
- 36 గంటల సుదీర్ఘ శస్త్రచికిత్సతో సత్తా

హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఉస్మానియా జనరల్ ఆసుపత్రి వైద్యులు వైద్య రంగంలోనే ఒక సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రాణాంతకమైన అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఒకే రోగికి ఏకకాలంలో ఐదు అవయవాలను విజయవంతంగా అమర్చారు. జీర్ణాశయం, చిన్న ప్రేగు, ప్యాంక్రియాస్, డుయోడెనమ్, కుడి పెద్ద ప్రేగులను ఒకే శస్త్రచికిత్స ద్వారా మార్పిడి చేశారు. భారతదేశంలోనే ఇలాంటి మల్టీవిసెరల్ ట్రాన్స్‌ప్లాంట్ జరగడం ఇదే మొదటిసారి అని వైద్య వర్గాలు వెల్లడించాయి. ఈ చారిత్రాత్మక శస్త్రచికిత్స ఏకధాటిగా 36 గంటల పాటు సాగడం విశేషం.

### సిరిసిల్ల ఇంజనీరుకు పునర్జన్మ

రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ముప్పై ఏళ్ల ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తీవ్రమైన ఆరోగ్య సమస్యతో ఉస్మానియా ఆసుపత్రిలో చేరారు. అతని ప్రాణాలను కాపాడటానికి అవయవ మార్పిడి ఒక్కటే మార్గమని వైద్యులు గుర్తించారు. జూన్ 29 సోమవారం ప్రారంభమైన ఈ సుదీర్ఘ ఆపరేషన్ మంగళవారం సాయంత్రానికి ముగిసింది. ప్రస్తుతం ఆ రోగి కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. జాతీయ వైద్యుల దినోత్సవం రోజే ఈ విజయం వెలుగులోకి రావడం విశేషం. ఈ అద్భుత ఘట్టాన్ని ఆవిష్కరించిన ఉస్మానియా వైద్య బృందాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహ ప్రత్యేకంగా అభినందించారు.

### బ్రెయిన్ డెడ్ మహిళ అవయవ దానం

ఈ శస్త్రచికిత్సకు అవసరమైన ఐదు అవయవాలు ఉస్మానియా ఆసుపత్రిలోనే బ్రెయిన్ డెడ్ అయిన ఒక మహిళ నుండి సేకరించారు. ఆమె కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకు రావడంతో ఈ ఐదు అవయవాలతో పాటు కళ్లు, చర్మం, కాలేయం, ఒక కిడ్నీని కూడా ఇతర రోగుల కోసం సేకరించారు. ఉస్మానియా సూపరింటెండెంట్ రాకేశ్ సహాయ్ నేతృత్వంలో గ్యాస్ట్రోఎంటరాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, అనస్థీషియా విభాగాలకు చెందిన నిపుణులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఇలాంటి క్లిష్టమైన శస్త్రచికిత్స చేయడం తమకు ఒక కల అని, అంతర్జాతీయ నిపుణుల సలహాలతో దీనిని విజయవంతం చేశామని గ్యాస్ట్రోఎంటరాలజీ హెడ్ సి.హెచ్. మధుసూదన్ పేర్కొన్నారు.

# ఉద్యోగాల ఉచ్చు

» మయన్మార్ సైబర్ మాఫియా కిరాతకం
» బంధీలుగా 400 మంది భారతీయులు
» థాయిలాండ్ ఉద్యోగం ఆశ చూపి మోసం

అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠా చేతిలో చిక్కుకుని మయన్మార్ నిర్బంధంలో నరకం అనుభవిస్తున్న కొందరు భారతీయుల వ్యథాభరిత గాథలు వెలుగులోకి వచ్చాయి. మహారాష్ట్ర నాసిక్ ప్రాంతానికి చెందిన కౌస్తుభ్ శేజ్వాల్ అనే ముప్పై ఏళ్ల యువకుడు ఈ ఘోర పరిస్థితిని ఫోన్ ద్వారా తన కుటుంబానికి వివరించాడు. ఏప్రిల్ నెలలో థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నెలకు 70 వేల రూపాయల జీతంతో కాల్ సెంటర్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి ఒక స్నేహితుడు అతడిని తీసుకెళ్లాడు. తీరా అక్కడికి వెళ్లాక గుర్తుతెలియని వ్యక్తులు అతడిని బలవంతంగా మయన్మార్ సరిహద్దుల్లోని ఒక రహస్య ప్రాంతానికి తరలించి బంధించారు.



### రోజుకు 18 గంటల వెట్టిచాకిరి

మయన్మార్ లోని ఆ పాతాళ గృహాల్లో బందీలుగా ఉన్న భారతీయులతో సైబర్ ముఠాలు రోజుకు పద్దెనిమిది గంటల పాటు బలవంతంగా పనిచేయిస్తున్నాయి. ఆన్‌లైన్ పెట్టుబడుల మోసాలు, క్రిప్టో కరెన్సీ అక్రమాలు చేయాల్సిందిగా ఒత్తిడి తెస్తున్నారు. కనీసం ఎలుకలు, బొద్దింకలు కూడా తినని అత్యంత అధ్వాన్నమైన ఆహారాన్ని వారికి పెడుతున్నారు. చెప్పినట్లు వినకపోతే ఒక గదిలో బంధించి దారుణంగా కొట్టడమే కాకుండా ఎలక్ట్రిక్ షాకులు ఇస్తూ హింసిస్తున్నారు. అక్కడ చిక్కుకున్న మహిళలపై కూడా శారీరక దాడులు జరుగుతున్నాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

### రక్షించాలని కుటుంబాల ఆవేదన

మహారాష్ట్రకు చెందిన 25 మంది యువకులతో పాటు దేశవ్యాప్తంగా సుమారు 400 మందికి పైగా భారతీయులు ఈ మాయాజాలంలో చిక్కుకున్నట్లు సమాచారం ఉంది. బాధితుల పాస్‌పోర్టులు లాక్కుని నిర్బంధించడంతో వారు స్వదేశానికి రాలేకపోతున్నారు. కౌస్తుభ్ తల్లిదండ్రులు తమ బిడ్డతో పాటు మిగిలిన వారిని సురక్షితంగా రక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వేడుకుంటున్నారు. స్థానిక నాయకుల సహాయంతో వారు మహారాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ మంత్రి గిరీష్ మహాజన్‌ను కలిసి సహాయం కోరారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుని విదేశాంగ శాఖ ద్వారా చర్యలు ముమ్మరం చేసింది.



# సేవతో పులకించిన బద్వేలు

- అన్న క్యాంటీన్‌లో పండుగ వాతావరణం
- అట్టహాసంగా మంచూరు జన్మదిన వేడుకలు





నాయకుడి జన్మదినాన్ని సేవా దినోత్సవంగా నిర్వహిస్తే ఎలా ఉంటుందో కడపజిల్లా బద్వేల్‌లో కనిపించింది. ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్, బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని అన్న క్యాంటీన్‌లో ప్రత్యేక భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంటీన్‌కు వచ్చిన ప్రజలకు ఉచితంగా భోజనాలు వడ్డిస్తూ జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా మార్చారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని భోజన వడ్డనలో స్వయంగా సేవలందించారు.

### పర్యావరణ పరిరక్షణ కోసం నగరవనం

బద్వేల్ నగర పరిధిలో ఏర్పాటు చేసిన నగరవనంను మంచూరు సూర్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. నగరవనాల ఏర్పాటు ద్వారా పచ్చదనాన్ని పెంపొందించి భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. బద్వేల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. నగరవనం ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసేందుకు అవసరమైన ఫ్లాగ్ పోల్‌ను తన సొంత నిధులతో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

### వృద్ధులకు ఆసరాగా వస్త్రాల పంపిణీ

బద్వేల్ పట్టణంలోని తెలుగు గంగ కాలనీలో ఉన్న ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వస్త్రాల పంపిణీ, అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వృద్ధులకు నూతన వస్త్రాలను అందజేసి నిరుపేదలకు అండగా నిలిచారు. సమాజంలోని నిరుపేదలు, వృద్ధులకు తోడ్పాటు అందించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు. మంచూరు సూర్యనారాయణ రెడ్డి జన్మదినాన్ని ఇలాంటి మంచి కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని వారు తెలిపారు. అభిమానులు వృద్ధులకు ఆత్మీయంగా సేవలు అందించారు.



### గురుకుల పాఠశాలల్లో దుప్పట్ల పంపిణీ

బీ.కోడూరు మండలం సరిలేరు సమీపంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, అలాగే కాశనగరం గ్రామంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చలి నుంచి రక్షణ పొందేందుకు విద్యార్థులకు దుప్పట్లు అందించడం ఎంతో ఆనందదాయకమని స్థానిక నాయకులు తెలిపారు. మంచూరు సూర్యనారాయణ రెడ్డి ప్రజాసేవను ధ్యేయంగా తీసుకుని నిరంతరం సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల ఆదరణను పొందుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు

మంచూరు సూర్యనారాయణ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శ్రీ లక్ష్మీ భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. బద్వేలు నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు కోసం, సర్వతోముఖాభివృద్ధి కోసం ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని కోరుకున్నారు.

# ఏపీ విద్యా సంస్కరణలకు జాతీయ గుర్తింపు

### లోకేశ్ మార్పులపై రాష్ట్రపతి ప్రశంసల జల్లు

ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేకంగా అభినందించారు. విద్యాశాఖ మంత్రిగా దేశానికే ఆదర్శంగా నిలిచేలా 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' కోసం ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతున్న విద్యా సంస్కరణలను ప్రశంసిస్తూ, ఇటువంటి మంచి మార్పులను భవిష్యత్తులోనూ ఇలాగే కొనసాగించాలని ఆమె సూచించారు.

### సెంట్రల్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో వీడ్కోలు

అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ముగించుకుని తిరిగి వెళుతున్న సమయంలో ఆమెకు వీడ్కోలు పలికేందుకు మంత్రి లోకేశ్ హెలిప్యాడ్ వరకు వెళ్లారు. ఆ సమయంలో రాష్ట్రపతి లోకేశ్‌ను తన దగ్గరకు పిలిపించుకుని మాట్లాడారు. ఏపీ విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన నూతన మార్పులు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు.

### విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది

ప్రస్తుతం ఏపీలో సాగుతున్న విద్యార్థి కేంద్రిత విద్యా విధానం యువత బంగారు భవిష్యత్తుకు చక్కటి మార్గం వేస్తుందని రాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు. స్నాతకోత్సవ సభలో మంత్రి లోకేశ్ చేసిన ప్రసంగం ఎంతో స్ఫూర్తివంతంగా సాగిందని అభినందించారు. పట్టభద్రులైన విద్యార్థులకు ఆయన ఇచ్చిన సందేశం వారి ఉన్నతికి తోడ్పడుతుందని ద్రౌపది ముర్ము అభినందించినట్లు అధికారులు తెలిపారు.

### న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం

మరోవైపు రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేకంగా 'అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్' తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం వేగంగా కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల సమయంలో నారా లోకేశ్ ఇచ్చిన 'యువగళం' హామీ అమలు దిశగా అడుగులు పడుతున్నాయి. క్షేత్రస్థాయిలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చట్టపరమైన రక్షణ కల్పించాలని న్యాయవాద సంఘాల ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కలసి విజ్ఞప్తి చేశారు.



# ప్రతిభా వంతులకు గౌరవం

- టాపర్లకు ఇళ్ల పట్టాల పంపిణీ

విద్య ద్వారానే సమాజంలో గొప్ప మార్పు సాధ్యమని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ముగ్గురు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక బహుమతి లభించింది. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ముందస్తు హామీ మేరకు ఈ విద్యార్థులకు రెండు సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు మంజూరు చేశారు. బుధవారం రేణిగుంట సమీపంలోని కొత్తపాలెం వేదికగా మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ఈ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులైన విద్యార్థులకు అధికారికంగా అందజేశారు.



### రాష్ట్ర స్థాయిలో మెరిసిన విద్యార్థులు

శ్రీకాళహస్తి నియోజకవర్గం కుంటిపూడికి చెందిన పి.జస్మిత పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను 598 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంక్, జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంక్ సొంతం చేసుకున్నారు. ఆమెతో పాటు బాబు అగ్రహారం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని జి.సాయి పూజిత 594 మార్కులు, తొండమనాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థి పి.మోహిత్ చరణ్ సాయి 591 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. ఈ ముగ్గురు టాపర్లకు శ్రీకాళహస్తి పట్టణ పరిధిలోని రాజీవ్ నగర్ లో రెండు సెంట్ల చొప్పున నివాస స్థలాల పత్రాలను అందజేసి సత్కరించారు.

### నో అడ్మిషన్ బోర్డులే లక్ష్యం

ఈ ప్రత్యేక సందర్భంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మంత్రి నారా లోకేశ్ ముఖాముఖి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గం నిడమర్రులోని ప్రభుత్వ పాఠశాలలో చేరడానికి ఇప్పుడు విపరీతమైన పోటీ నెలకొందని గుర్తుచేశారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు నిండిపోయి 'నో అడ్మిషన్' బోర్డులు కనిపించాలనేదే తమ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

### ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్

విద్యార్థులు, ఉపాధ్యాయుల ఉమ్మడి సంకల్పంతోనే తాము ఆశిస్తున్న 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' పూర్తిస్థాయిలో సాకారమవుతుందని లోకేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందిస్తామని భరోసా ఇచ్చారు. యువత అద్భుతమైన భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. చదువులో రాణించిన విద్యార్థులను అభినందిస్తూ వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# దేశ జనాభా మార్పులపై కేంద్రం ఫోకస్

- జనాభా మార్పులపై ప్రత్యేక కమిటీ కసరత్తు
- రాష్ట్రాలకు ప్రత్యేక ప్రశ్నావళి పంపిణీ



దేశంలో గత 2011 జనాభా లెక్కల తర్వాత చోటుచేసుకున్న జనాభా మార్పులు, కొత్త నివాస ప్రాంతాల ఏర్పాటుపై అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ రంగంలోకి దిగింది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలోని ఈ జనాభా మార్పుల కమిటీ అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు ఒక సుదీర్ఘమైన ప్రశ్నావళిని పంపడానికి సిద్ధమైంది. 2011 నాటి జనాభా గణాంకాలను ప్రస్తుత పరిస్థితులతో పోల్చి చూసి ఎక్కడెక్కడ అసాధారణ మార్పులు జరిగాయో ఈ కమిటీ క్షుణ్ణంగా పరిశీలించనుంది. అవసరమైన ప్రాంతాలలో కమిటీ సభ్యులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరిస్తారు. ప్రజలు తమ సూచనలు, సలహాలు పంపడానికి వీలుగా ఒక ప్రత్యేక ఈమెయిల్ ఐడీని కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.

### 2027 జనాభా లెక్కల తొలి దశ

దేశంలో దాదాపు పదహారేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తదుపరి జనాభా గణన ప్రక్రియ ప్రారంభమైంది. 'జనాభా గణన 2027' కి సంబంధించిన మొదటి విడత పనులు ప్రస్తుతం దేశంలోని పలు ప్రాంతాలలో ముమ్మరంగా సాగుతున్నాయి. ఇళ్ల జాబితా తయారీ, గృహ వసతుల గుర్తింపు ప్రక్రియ ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ నాటికి పూర్తి కానుంది. దీని ఆధారంగా ఆయా ప్రాంతాలలో పెరిగిన నివాసాలు, జనాభాపై ఒక ప్రాథమిక అంచనాకు రావడానికి వీలవుతుంది. దీని తర్వాత అసలు జనాభా లెక్కింపు ప్రక్రియను వచ్చే ఏడాది మార్చి 1, 2027 నాటికి పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ గణాంకాలు దేశ భవిష్యత్తు ప్రణాళికలకు ఎంతో కీలకం కానున్నాయి.

### ఓటర్ల తొలగింపుపై నివేదికల సేకరణ

దేశంలో అక్రమ వలసదారుల సంఖ్యను ఖచ్చితంగా అంచనా వేయడానికి ఈ ఉన్నత స్థాయి కమిటీ ఎన్నికల సంఘం సహాయం తీసుకోనుంది. ఇటీవల నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఓటు హక్కు కోల్పోయిన వారి వివరాలను కమిటీ సేకరించనుంది. జాబితా నుండి పేర్లను ఎందుకు తొలగించాల్సి వచ్చిందనే కారణాలను కూడా నివేదిక రూపంలో ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరనుంది. ఇప్పటివరకు 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఈ సవరణ ప్రక్రియ పూర్తయింది. ఇందులో భాగంగా చాలా మంది ఓటర్ల పేర్లు తొలగించినట్లు తెలుస్తోంది. ఈ తొలగింపుల వెనుక ఉన్న అసలు కారణాలను విశ్లేషించడం ద్వారా అక్రమ వలసలను గుర్తించడం సులువవుతుందని కమిటీ భావిస్తోంది.

### కేంద్ర హోంమంత్రితో కమిటీ భేటీ

జనాభా మార్పుల కమిటీ సభ్యులు జూన్ 25వ తేదీన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తాము చేపట్టబోయే క్షేత్రస్థాయి పర్యటనలు, వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలతో జరపబోయే చర్చల ప్రణాళికను హోంమంత్రికి వివరించారు. కమిటీ వ్యూహాన్ని అభినందించిన అమిత్ షా, కమిటీ రోజువారీ పనులకు, పర్యటనలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్‌ను ఆదేశించారు. దేశ భద్రత, ప్రగతి దృష్ట్యా ఈ కమిటీ తన నివేదికను, సిఫార్సులను సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వానికి సమర్పించాలని హోంమంత్రి సూచించారు.

### అక్రమ వలసల నిరోధానికి శాశ్వత వ్యవస్థ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2025 ఆగస్టు 15న ఎర్రకోట వేదికగా ఈ జనాభా మిషన్‌ను ప్రకటించారు. దీని ఆధారంగానే ఈ ఏడాది మే 26న కేంద్ర హోంశాఖ ఈ ఉన్నత స్థాయి కమిటీని అధికారికంగా ఏర్పాటు చేసింది. అక్రమ వలసల కారణంగా దేశంలో వస్తున్న జనాభా మార్పులను అరికట్టడానికి ఈ కమిటీ శాశ్వత పరిష్కారాలను సూచించనుంది. దేశంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులను చట్టబద్ధంగా, నిర్ణీత కాల వ్యవధిలో గుర్తించి, నిర్బంధించి, వారి సొంత దేశాలకు పంపించేందుకు ఒక పటిష్టమైన కార్యాచరణ వ్యవస్థను ఈ కమిటీ సిఫార్సు చేయనుంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నవ్లేకర్ నేతృత్వంలోని ఈ కమిటీలో మృత్యుంజయ్ కుమార్ నారాయణ్, దుర్గాశంకర్ మిశ్రా, బాలాజీ శ్రీవాస్తవ, షామికా రవి సభ్యులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# సీసీ రోడ్ల పనులపై ఎమ్మెల్యే సమీక్ష



రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మండపేట మండలంలోని ద్వారపూడి, కేశవరం గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లను బుధవారం పరిశీలించారు. ద్వారపూడిలోని వెంకట పద్మావతి నగర్‌లో నిర్మించిన సీసీ రోడ్లతో పాటు జెడ్. మేడపాడు-ద్వారపూడి రహదారి పనులను పరిశీలించి, నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. అనంతరం కేశవరం గ్రామంలోని ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించి నాణ్యతపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# సత్యదేవుని ఆలయంలో మహా అన్నదానం



ఏలేశ్వరం సమీపంలోని ఏలేరు నది ఒడ్డున ఉన్న శ్రీ అనంతలక్ష్మి సమేత వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా సుమారు 2,000 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రచారకర్త నల్లమల్లి కృష్ణబాబు తెలిపారు. స్వామివారి ఆదేశాలతోనే ఈ సంప్రదాయం ప్రారంభమైందని వివరించారు. ఆలయ అర్చకులు, దేవస్థాన సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# 42 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 42 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం రూ.15.31 లక్షల విలువైన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యవసర వైద్య చికిత్సలు, ఇతర అవసరాల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ పేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### నాలుగు డివిజన్లకు నిధులు ఇవ్వాలి: ఎమ్మెల్యే

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం మల్కాజిగిరి జోనల్ కమిషనర్‌ను కలిసి నియోజకవర్గంలోని ఓల్డ్ బోయినపల్లి, హస్మత్‌పేట్, ఫతేనగర్, బేగంపేట్ డివిజన్లకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రెండున్నరేళ్లుగా నిధులు అందక అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, ఇర్ఫాన్, హరినాథ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



# నేరచరిత మంత్రులకు సంకటం

- ముప్పై రోజుల కస్టడీ చట్టానికి ఆమోదం

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై పార్లమెంటరీ ఉమ్మడి కమిటీ (జేపీసీ) కీలక నిర్ణయం తీసుకోనుంది. తీవ్రమైన నేరారోపణలపై అరెస్ట్ అయ్యి, వరుసగా 30 రోజుల పాటు కస్టడీలో ఉండే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు లేదా ఇతర మంత్రులను వారి పదవుల నుండి వెంటనే తొలగించాలనే ప్రతిపాదనను జేపీసీ యథాతథంగా ఉంచే అవకాశం ఉంది. ఈ నిబంధనలో ఎలాంటి మార్పులు చేయకూడదని కమిటీ భావిస్తోంది. డిసెంబర్ 2025 నుండి జరిగిన పది రౌండ్ల సుదీర్ఘ చర్చల అనంతరం ఈ ముసాయిదా నివేదిక సిద్ధమైంది.

### జూలై 10 నాటికి ముసాయిదా నివేదిక

బీజేపీ ఎంపీ అపరాజిత సారంగి నేతృత్వంలోని 31 మంది సభ్యుల ఈ జేపీసీ తన ముసాయిదా నివేదికను జూలై 10వ తేదీ నాటికి సర్క్యులేట్ చేయనుంది. ఆ తర్వాత జూలై 17న కమిటీ మరోసారి సమావేశమై నివేదికకు తుది రూపు ఇస్తుంది. జూలై 20 నుండి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల కంటే ముందే ఈ సిఫార్సులను ఖరారు చేయాలని ప్యానెల్ గట్టిగా నిర్ణయించింది. అధికార కూటమికి కమిటీలో పూర్తి బలమున్నందున తమ అభిప్రాయాలకు విలువ ఉండదనే నెపంతో ఇండియా కూటమి సభ్యులు ఈ జేపీసీ సమావేశాలను బహిష్కరించడం గమనార్హం.

### దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు

ఈ నూతన నిబంధన ప్రకారం నిందితులకు బెయిల్ తెచ్చుకోవడానికి 30 రోజుల సుదీర్ఘ సమయం దొరుకుతుందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు ఎలాంటి భంగం కలిగించదని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ చట్టం రాజకీయ ప్రతీకారాలకు లేదా దుర్వినియోగానికి గురికాకుండా ఉండేలా కమిటీ ఒక ప్రత్యేకమైన హెచ్చరిక క్లాజును కూడా నివేదికలో చేర్చనుంది. రాజకీయాల్లో నైతికతను, సుపరిపాలనను పెంపొందించేందుకు ఈ చట్టం ఎంతో దోహదపడుతుందని అధికార పక్షం బలంగా నమ్ముతోంది. ఈ బిల్లు ఆమోదం పొందితే దేశ రాజకీయాల్లో జవాబుదారీతనం మరింత పెరుగుతుంది.

# అతి చేస్తే చెప్పుతో కొడతా



- వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి ఎమ్మెల్యే ఆది ఘాటు హెచ్చరికలు

జిల్లా రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిని ఉద్దేశించి ఆయన మండిపడ్డారు. రాజకీయ వ్యూహాల్లో భాగంగా ఈ ఇద్దరు నేతల మధ్య ఎప్పటి నుంచో విభేదాలు ఉన్నాయి. తాజా వ్యాఖ్యలు జిల్లా రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించాయి. నియోజకవర్గంలో పట్టు కోసం సాగుతున్న ఈ పోరు ఇప్పుడు బహిరంగ విమర్శల స్థాయికి చేరింది.

### హద్దులు దాటితే చెప్పుతో కొడతా

వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి చాలా అతిగా వ్యవహరిస్తున్నారని ఆదినారాయణ రెడ్డి ఆరోపించారు. ఇదే తీరు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రాజకీయాల్లో హద్దులు దాటితే తాను చూస్తూ ఊరుకోనని స్పష్టం చేశారు. ఒకరినొకరు తక్కువ చేసి మాట్లాడుకోవడం సరికాదని హితవు పలికారు. ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలే తప్ప వ్యక్తిగత దూషణలు చేస్తే ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు.

### నా బొచ్చు కూడా పీకలేకపోయారు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తనపై అనేక అక్రమ కేసులు బనాయించారని ఆదినారాయణ రెడ్డి ఆరోపించారు. ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ వైసీపీ నేతలు తనకు ఏమీ చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. "నా బొచ్చు కూడా పీకలేకపోయారు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పోలీసు వ్యవస్థను వాడుకుని ఇబ్బందులు పెట్టాలని చూసినా తాను వెనకడుగు వేయలేదని గుర్తు చేశారు. తనను రాజకీయంగా దెబ్బతీయడం ఎవరి తరం కాదని ధీమా వ్యక్తం చేశారు.

### జైలు, కేసులు మాకు కొత్త కాదు

తమ కుటుంబానికి కేసులు, జైలు జీవితం కొత్త కాదని ఆదినారాయణ రెడ్డి అన్నారు. ఫ్యాక్షన్ రాజకీయాల కారణంగా తమ కుటుంబ సభ్యులను కూడా కోల్పోయామని గుర్తు చేశారు. తాము ఎన్నో కష్టాలు చూసి ఈ స్థాయికి వచ్చామని చెప్పారు. ఎలాంటి ఒత్తిళ్లకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. బెదిరింపులకు లొంగిపోయే తత్వం తమది కాదని, ప్రజల కోసమే తాము నిలబడతామని వివరించారు.

### మరో మూడేళ్లు మాదే అధికారం

కూటమి ప్రభుత్వం ఇంకా మూడు సంవత్సరాలు అధికారంలో ఉంటుందని ఆదినారాయణ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆలోపు వైసీపీ నాయకులకు "సినిమా చూపిస్తా" అంటూ హెచ్చరికలు చేశారు. ప్రభుత్వ అండతో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని చెప్పారు. తప్పులు చేసిన వారు చట్టానికి దొరికిపోవడం ఖాయమన్నారు. ఈ వ్యాఖ్యలు కడప జిల్లా రాజకీయాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారితీశాయి. రాబోయే రోజుల్లో ఈ వివాదం ఇంకా ఎంత దూరం వెళ్తుందో చూడాలి.



# తుది జట్టులో యువ సంచలనానికి దక్కని చోటు

- **సూర్యవంశీ నిరీక్షణపై కెప్టెన్ శ్రేయస్ వివరణ**

ఐర్లాండ్ సిరీస్ తర్వాత ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మొదటి టీ20 మ్యాచ్‌లోనూ భారత యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో స్థానం దక్కలేదు. ఐర్లాండ్ పర్యటనలో ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో ఈ మ్యాచ్‌లో సూర్యవంశీ బరిలోకి దిగుతాడని అభిమానులు భావించారు. అయితే టాస్ సమయంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ జట్టుకు ప్రపంచకప్ అందించిన సీనియర్ ఆటగాళ్లకు మరిన్ని అవకాశాలు ఇచ్చి అండగా నిలవడమే తమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు. సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న రికార్డును కూడా అతను అధిగమిస్తాడు. యువ ఆటగాడికి మరిన్ని అవకాశాలు ఇచ్చేందుకు భవిష్యత్తులో రొటేషన్ విధానాన్ని అమలు చేయాలని మాజీ సెలెక్టర్లు అభిప్రాయపడుతున్నారు.

# నీళ్ల బాటిళ్లు మోయడం తక్కువ కాదు

- **విమర్శకులకు అశ్విన్ ఘాటు సమాధానం**



భారత టీ20 జట్టులోకి ఎంపికైన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి ఐర్లాండ్ సిరీస్‌లో ఆడే అవకాశం రాలేదు. దీనిపై స్పందిస్తూ, జట్టు వెలుపల కూర్చుని ఆటను గమనించడం, సహచర ఆటగాళ్లకు నీళ్లు అందించడం వల్ల ఎంతో నేర్చుకోవచ్చని సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ గతంలో వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో కొందరు అభిమానులు అశ్విన్‌ను తీవ్రంగా విమర్శించారు. ఆడించనప్పుడు అసలు జట్టులోకి ఎందుకు తీసుకోవాలంటూ ప్రశ్నలు కురిపించారు. ఈ విమర్శలపై అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఘాటుగా సమాధానం ఇచ్చారు. మైదానంలోకి వెళ్లి భారత ఆటగాళ్లకు నీళ్ల బాటిళ్లు అందించడం ఎప్పటి నుండి తక్కువ పని అయిందని ఆయన ప్రశ్నించారు. 1990, 2000వ దశకంలో చెన్నైలో తాను బాల్ బాయ్‌గా పనిచేస్తూ క్రికెటర్లకు నీళ్లు అందించినప్పుడు ఎంతో సంతోషపడ్డానని గుర్తుచేశారు. వైభవ్ అద్భుతమైన ఆటగాడని, భవిష్యత్తులో అతనికి కచ్చితంగా అవకాశాలు వస్తాయని, అయితే జట్టు వాతావరణాన్ని అర్థం చేసుకోవడానికి ఈ అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని అశ్విన్ స్పష్టం చేశారు.



# వర్షార్పణమైన మ్యాచ్

## ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ తొలి టీ20

చెస్టర్‌లీస్ట్రీట్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన మొదటి టీ20 మ్యాచ్ భారీ వర్షం కారణంగా రద్దయింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 189 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే, ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ ప్రారంభం కాకముందే వర్షం తీవ్రం కావడంతో మ్యాచ్‌ను అంపైర్లు రద్దు చేశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ప్రారంభంలోనే గట్టి షాక్ తగిలింది. అయితే, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ అద్భుత అర్ధసెంచరీలతో జట్టును ఆదుకున్నారు. టీ20 కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ కేవలం 30 బంతుల్లోనే తన తొలి హాఫ్ సెంచరీ పూర్తి చేసి, మొత్తం 47 బంతుల్లో 68 పరుగులు సాధించాడు. అభిషేక్ శర్మ కూడా ధాటిగా ఆడి స్కోరు బోర్డును పరుగెత్తించాడు. చివర్లో శివం దూబే మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 21 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 42 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో భారత్ 189 పరుగులు చేయగలిగింది. భారత్ ఇన్నింగ్స్ పూర్తయినప్పటికీ, ఇంగ్లాండ్ చేజింగ్ ప్రారంభించే సమయానికి వర్షం ఎంతకీ తగ్గకపోవడంతో ఆటను నిలిపివేయక తప్పలేదు.

# మెస్సీతో పోలిక వద్దు..

## నా ఫోకస్ అంతా వరల్డ్ కప్ ఫైనల్‌పైనే

*– ఫ్రాన్స్ కెప్టెన్, రియల్ మాడ్రిడ్ స్టార్ కిలియన్ ఎంబాప్పే..*

ఫిఫా ప్రపంచకప్ 2026లో భాగంగా స్వీడన్‌తో జరిగిన రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో ఫ్రాన్స్ 30 తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో రెండు గోల్స్ చేసిన ఫ్రాన్స్ కెప్టెన్, రియల్ మాడ్రిడ్ స్టార్ కిలియన్ ఎంబాప్పే.. వరల్డ్ కప్ నాకౌట్ చరిత్రలోనే అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు వరల్డ్ కప్‌లో ఆడిన 18 మ్యాచ్‌లలో అతను 18 గోల్స్ చేశాడు. అయితే, అర్జెంటీనా లెజెండ్ లియోనెల్ మెస్సీ రికార్డులతో తనను పోల్చడంపై ఎంబాప్పే స్పందించాడు. వ్యక్తిగత రికార్డుల కంటే జట్టును జూలై 19న జరిగే ఫైనల్‌కు చేర్చడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పాడు. మెస్సీ భవిష్యత్తులో మరిన్ని గోల్స్ చేస్తాడని తనకు తెలుసని, అందుకే తాను రికార్డులపై దృష్టి పెట్టడం లేదని స్పష్టం చేశాడు. రౌండ్ ఆఫ్ 16లో పరాగ్వేతో జరగబోయే తదుపరి మ్యాచ్ కోసం తమ వ్యూహాలను మరింత మెరుగుపరుచుకుంటామని ఎంబాప్పే తెలిపాడు. జట్టు ప్రదర్శన ప్రస్తుతం సానుకూలంగా ఉందని, అయితే ఇంకా మెరుగవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు.



# ఢిల్లీ లీగ్ వేలంలో స్టార్ వారసుల సందడి

- **పెరిగిన క్రేజ్ తో ఆటగాళ్లపై కాసుల వర్షం**

ఢిల్లీ ప్రీమియర్ లీగ్ మూడో సీజన్ ఆటగాళ్ల వేలం పాటలు అత్యంత ఆసక్తికరంగా సాగాయి. ఈ వేలంలో ప్రముఖ క్రికెటర్ల వారసులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ చిన్న కుమారుడు, 16 ఏళ్ల వేదాంత్ సెహ్వాగ్‌ను సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ రూ. 1 లక్షకు సొంతం చేసుకుంది. కుడిచేతి వాటం ఆల్‌రౌండర్ అయిన వేదాంత్ ఆఫ్ స్పిన్ బౌలింగ్‌తో ఇప్పటికే మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. అలాగే అతని అన్న ఆర్యవీర్ సెహ్వాగ్‌ను వెస్ట్ ఢిల్లీ లయన్స్ రూ. 3 లక్షలకు కొనుగోలు చేసింది. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మేనల్లుడు, 16 ఏళ్ల ఆర్యవీర్ కోహ్లీని కూడా సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ జట్టు దక్కించుకుంది. మరోవైపు బిహార్ ప్రముఖ రాజకీయ నాయకుడు పప్పూ యాదవ్ కుమారుడు సార్థక్ రంజన్‌ను నార్త్ ఢిల్లీ స్ట్రైకర్స్ 'రైట్ టు మ్యాచ్' ద్వారా రూ. 17 లక్షలకు తిరిగి సాధించుకుంది. ఈ వేలంలో అందరి కంటే ఎక్కువగా యువ హిట్టర్ తేజస్వి దహియా రికార్డు స్థాయి ధర పలికాడు. సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్జ్ అతడిని రూ. 40 లక్షల భారీ ధరకు దక్కించుకోవడంతో ఈ ఏడాది లీగ్‌లోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు.







# ఫ్యామిలీ డ్రామాకు తోడు క్రైమ్ థ్రిల్లర్

విక్టరీ వెంకటేష్ హీరోగా, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న ఆదర్శ కుటుంబంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు క్రైమ్ థ్రిల్లర్ అంశాలను జోడిస్తూ రూపొందుతున్న ఈ చిత్రం విడుదల తేదీని ఇటీవల చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. విక్టరీ వెంకటేష్ హీరోగా, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న ఆదర్శ కుటుంబంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. సినిమాలో సుదీర్ఘంగా సాగే ఓ ట్రైన్ ఎపిసోడ్‌ను ప్రత్యేకంగా రూపొందించారట. సిట్యుయేషనల్ కామెడీతో నిండిన ఈ సన్నివేశం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేలా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఇటీవలే ఈ ఎపిసోడ్ చిత్రీకరణ పూర్తయిందని, ఇందులో వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లను వినోదాత్మకంగా తెరకెక్కించడంలో త్రివిక్రమ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. మరోవైపు కామెడీ, భావోద్వేగ సన్నివేశాల్లో వెంకటేష్‌కు ఉన్న టైమింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమాను హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఇటీవల ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్లు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో, ఈ సినిమాపై కూడా మంచి అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం 'ఆదర్శ కుటుంబం' షూటింగ్ శరవేగంగా కొనసాగుతున్నట్లు సమాచారం.

# కాగితం పడవలు బృందానికి చిరు అభినందనలు

కర్ణాటక రాష్ట్రంలోని చింతామణిలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ, కాలక్రమేణా ఒక చిత్ర నిర్మాతగా మారిన మెగా అభిమాని అంజనప్ప, 45 మంది తన స్నేహితులు, 'కాగితం పడవలు' చిత్రబృందంతో కలిసి చిరంజీవిపై ఉన్న అభిమానంతో, వందల కిలోమీటర్లు ప్రయాణించి మరీ హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని రక్తదానం చేశారు. 'రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి' అని మెగాస్టార్ చిరంజీవి ఇచ్చిన పిలుపును గుండెల్లో నింపుకుని, లక్షలాది మంది ప్రాణాలను కాపాడటంలో మెగాభిమానులు ఎప్పుడూ ముందుంటారని మరోసారి వారంతా నిరూపించారు. ఈ విషయం చిరంజీవి వరకు చేరడంతో ఆయన చాలా హ్యాపీగా ఫీలయ్యారు. విశేషం ఏంటంటే.. అంజనప్ప ఇంతవరకు చిరంజీవిని నేరుగా కలవలేదు. కేవలం చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌కు వచ్చి తన బాధ్యతగా తన చిత్ర బృందంతో కలిసి రక్తదానం చేసి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న చిరంజీవి.. సినిమా షూటింగ్, ఇతర సామాజిక కార్యక్రమాలతో తీరిక లేకుండా ఉన్నప్పటికీ.. అంజనప్ప అండ్ టీమ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ స్వయంగా ఒక లెటర్ పంపించారు.
ప్రియమైన అంజనప్ప, గాయత్రమ్మ.. ఇంకా 'కాగితం పడవలు' చిత్రయూనిట్ సభ్యులకు.. మానవత్వాన్ని పరిమళింపజేస్తూ, సమాజం పట్ల మీ బాధ్యతను చాటుతూ మీరు చేపట్టిన రక్తదాన సేవా కార్యక్రమానికి నా హృదయపూర్వక అభినందనలు. ఈరోజు చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో 'కాగితం పడవలు' చిత్రయూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో మొత్తం 23 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. వైద్య కారణాల వల్ల రక్తదానం చేయలేకపోయిన వారు, ఈ మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములు కావాలనే సంకల్పంతో రావడం కూడా ప్రశంసనీయం.





# ఆల్ఫా సెన్సార్ పూర్తి

## 3న విడుదల

శివ్ రావైల్ దర్శకత్వంలో, అలియా భట్, శర్వరి ప్రధాన పాత్రలు పోషిస్తున్న భారీ యాక్షన్ మూవీ 'ఆల్ఫా'. జులై 3న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా తాజాగా సెన్సార్ పనులు పూర్తి చేసుకుంది.
ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ఇప్పటికే యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. సినిమాలో కొన్ని మార్పులు చేయాలని కోరింది. ద్వితీయార్ధంలో వచ్చే కొన్ని సన్నివేశాల తీవ్రతను తగ్గించి, ప్రత్యామ్నాయ దృశ్యాలను పెట్టాలని సూచించింది. ప్రథమార్ధంలోని ఓ డైలాగ్‌ను తొలగించి, మరో రెండు సంఘటనల విజువల్స్‌ను తగ్గించాలని ఆదేశించింది. మద్యం తీసుకునే సన్నివేశాల్లో గమనిక వేయాలని, మూవీలోని అన్ని పాటలకూ సబ్‌టైటిల్స్ జోడించాలని కోరింది. సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ కోసం వారి తల్లిదండ్రుల నుంచి అనుమతి లేఖను సమర్పించాలని ఆదేశించింది. తాజాగా ఆల్ఫా ఈ పనులన్నీ పూర్తి చేసుకుంది. ఈ భారీ యాక్షన్ సినిమా నిడివి 2 గంటల 20 నిమిషాల 48 సెకన్లు. ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ మూవీలో బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రలు పోషిస్తుండగా, హృతిక్ రోషన్ అతిథి పాత్రలో కనిపించనున్నారు.







# టాక్సిక్ నుంచి లేడీస్ అండీస్ గ్లింప్స్ విడుదల

రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ గ్లింప్స్ ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో పీరియడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతున్న హై`బడ్జెట్ చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్`అప్స'. ఇప్పటివరకు యష్ లుక్స్, యాక్షన్‌తోనే సెన్సేషన్ క్రియేట్ చేసిన మేకర్స్, తాజాగా ఈ చిత్రంలోని పవర్‌ఫుల్ మహిళా పాత్రలను పరిచయం చేస్తూ మరింత బోల్డ్‌గా 'లేడీస్ అండ్ లేడీస' గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ ఊహించని విధంగా అత్యంత బోల్డ్, రా అండ్ రస్టిక్ విజువల్స్‌తో సాగింది. చిత్రంలో నటిస్తున్న లేడీస్ అందరినీ గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో ఎంతో పవర్‌ఫుల్‌గా ప్రెజెంట్ చేశారు. నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి, తారా సుతారియా, మరియు రుక్మిణి వసంత్ లతో కూడిన ఈ భారీ లేడీ కాస్టింగ్ గ్లింప్స్‌లో మునుపెన్నడూ చూడని బోల్డ్ అవతార్లలో కనిపించి షాక్ ఇచ్చారు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అద్భుతమైన విజువల్స్ ఈ గ్లింప్స్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. 'డాడీ ఈజ్ హోమ' అంటూ యష్ ఎంతటి పవర్‌ను చూపించాడో, ఈ లేడీ గ్యాంగ్ అంతకంటే ఎక్కువ 'టాక్సిక'గా ఉండబోతోందని ఈ గ్లింప్స్ ద్వారా స్పష్టమైంది. కెవిఎన్ ప్రొడక్షన్స్ మరియు యష్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ భారీ పాన్`ఇండియా చిత్రం ఆగస్ట్ 26, 2026 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

This newspaper is published by LELLA SIVA PRASAD from BLOCK 43, FLAT 114, MALESIYAN TOWNSHIP NORTH PHASE NEAR DMARTKPHB 5TH PHASE, MEDCHAL MALKAJGIRI, TELANGANA-500072.. Editor: LELLA SIVA PRASAD and printed by SREEBHASHYAM YADUMOHAN at YADU GRAPHICS GROUND FLOOR, 3-2-798, STO BHAVAN, CHAPPAL BAZAR, KACHIGUDA, HYDERABAD, TELANGANA-500027. PRGI Reg. No. TGTEL/26/A0382. Email: sivaprasadlella@gmail.com, 9010210202